డీఎంకేలోకి మాజీ ఎంపీ అన్వర్‌రాజా

● శాలువా కప్పి స్వాగతం పలికిన స్టాలిన్ ● అన్నాడీఎంకే నుంచి తొలగింపు

చెన్నై, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ ఎంపీ అన్వర్‌రాజా డీఎంకేలో చేరారు. సోమవారం ఉదయం తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయమైన అన్నా అరివాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో డీఎంకే సభ్యత్వం స్వీకరించారు. అన్నాడీఎంకే, బీజేపీ మధ్య పొత్తు కుదిరినప్పటి నుండి అన్వరాజా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. అన్నాడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి బీజేపీకి భయపడుతున్నారని, రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థి తానేనని ఏ సభలోనూ ప్రకటించకుండా ప్రచార యాత్ర చేస్తున్నారని విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో పార్టీ నుండి వైదొలగి డీఎంకే చేరాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని పసిగట్టిన ఈపీఎస్ సోమవారం ఉదయమే అన్వర్‌రాజాను పార్టీ నుండి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఆ ప్రకటన వెలువడిన అరగంటలోపే అన్వర్‌రాజా అన్నా అరివాలయంలో స్టాలిన్‌ను కలుసుకుని డీఎంకే సభ్యత్వం స్వీకరించారు. ఆ సందర్భంగా మంత్రులు దురైమురుగన్, ఈవీ వేలు, పీకే శేఖర్ బాబు, అనితా రాధాకృష్ణన్ తదితరులు ఆయనను అభినందించారు. ఆ తర్వాత అరివాలయం వెలుపల



అన్వర్‌రాజాను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

డీఎంకేలో చేరటానికి గల కారణాలను మీడియాకు వివరించారు.

పొత్తు నచ్చకే డీఎంకేలో చేరా...

మతతత్త్వపార్టీ బీజేపీతో అన్నాడీఎంకే పొత్తుపెట్టుకున్నప్పటి నుంచి తాను అసంతృప్తి వ్యక్తం చేశానని, అదే సమయంలో అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థి ఈపీఎస్ అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఎలాంటి ప్రకటన చేయకపోవడాన్ని కూడా పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్ళానని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ ప్రతికూల శక్తి అని, అన్నాడీఎంకేని నాశనం చేయాలని కంకణం కట్టుకుందని, అందుకే పార్టీతో పొత్తుకుదుర్చుకుందన్నారు. ఒక వేళ అన్నాడీఎంకే అధికారంలోకి వచ్చినా బీజేపీ మంత్రివర్గంలో అధిక స్థానాలు సంపాదించుకుని పార్టీని నాశనం చేయడం తథ్యమన్నారు. మహారాష్ట్రలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, శివసేనను నాశనం చేసి బీజేపీ అధికారంలోకి వచ్చిందన్న విషయాన్ని ఎవరూ మరువలేరన్నారు. అన్నాడీఎంకే - బీజేపీ పొత్తును రాష్ట్ర ప్రజలు కోరుకోవడం లేదని, అన్నాడీఎంకేకి చెందిన ఏడుగురు మాజీ మంత్రులు బీజేపీతో పొత్తును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. ఈ పరిస్థితులలోనే తాను ద్రావిడ సిద్ధాంతాలకు అనుగుణంగానే డీఎంకేలో చేరానని వెల్లడించారు. తానెప్పటికీ అవకాశవాదిని కానని, ద్రావిడ భావజాలం, తమిళ భాష, తమిళజాతిని కాపాడటమే తన లక్ష్యమని అన్వర్‌రాజా స్పష్టం చేశారు. ఈ కారణాల వల్లే అరివాలయంలో డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్, ఆ పార్టీకి చెందిన సీనియర్ మంత్రులంతా తనను సాదరంగా ఆహ్వానించారన్నారు. రాష్ట్ర ఓటర్లు ఎల్లప్పుడూ ప్రజాభిమానం కలిగిన నాయకులనే ఎన్నుకుంటారని, ప్రస్తుతం అత్యధిక ప్రజాదరణ కలిగిన స్టాలిన్‌ను తప్పకుండా మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటారని చెప్పారు.



నూతన సీజేకు శుభాకాంక్షలు చెబుతున్న గవర్నర్

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎంఎం శ్రీవాస్తవ ప్రమాణ స్వీకారం

చెన్నై, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టు 36వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎంఎం శ్రీవాస్తవ ప్రమాణస్వీకారం చేశారు. సోమవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన చేత గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రమాణం చేయించారు. ఇప్పటి వరకూ మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన జస్టిస్ కేఆర్ శ్రీరామ్ రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయిన విషయం తెలిసిందే. అదే విధంగా రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవను మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులిచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం 4 గంటలకు జస్టిస్ శ్రీవాస్తవ చేత గవర్నర్ ప్రమాణం చేయించారు. అనంతరం ఆయనకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలా వుండగా జస్టిస్ ఎంఎం శ్రీవాస్తవ 1965 మార్చిలో ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్రం బిలాస్‌పూర్‌లో జన్మించారు. 2009లో ఛత్తీస్‌ఘఢ్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021లో రాజస్థాన్ హైకోర్టుకు బదిలీ కాగా, గత ఏడాది రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. జస్టిస్ శ్రీవాస్తవ వచ్చే ఏడాది మార్చిలో పదవీ విరమణ చేయనున్నారు. ఇదిలా వుండగా జస్టిస్ శ్రీవాస్తవ ప్రమాణ స్వీకారానికి ముఖ్యమంత్రి, ఆయన మంత్రివర్గ సహచరులు హాజరు కావాల్సివుంది. అయితే అనారోగ్యం కారణంగా సీఎం గైర్హాజరుకావడంతో, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధితో పాటు పలువురు మంత్రులు హాజరయ్యారు.

నూతన డీజీపీ కోసం జాబితా సిద్ధం

● యూపీఎస్సీకి సీనియర్ల జాబితా పంపనున్న ప్రభుత్వం



డీజీపీ శంకర్ జివాల్

చెన్నై, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నూతన పోలీస్ బాస్ కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్వేషణ మొదలుపెట్టింది. ప్రస్తుత డీజీపీ శంకర్ జివాల్ పదవీకాలం ఆగస్టు 30తో పూర్తి కానుండడంతో నూతన డీజీపీ కోసం సీనియర్ ఐపీఎస్ అధికారుల జాబితా పంపించేందుకు సన్నాహాలు చేపడుతోంది. శంకర్ జివాల్ పదవీ కాలాన్ని పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రప్రభుత్వానికి సిఫారసు చేస్తుందని పోలీసు వర్గాలు భావించినా, వచ్చే ఏడాదిలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా నూతన పోలీస్ బాస్‌ను ఎంపిక చేసేందుకే ప్రభుత్వం మొగ్గు చూపినట్లు సమాచారం. సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన మార్గదర్శకాల మేరకు సీనియర్ ఐపీఎస్ అధికారుల జాబితా సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఆ జాబితాను త్వరలో యూపీఎస్సీకి పంపించనుంది. డీజీపీ హోదా కలిగిన ఎనిమిదిమంది సీనియర్ అధికారుల జాబితాలో ముందు వరుసలో సీమా అగర్వాల్, రాజీవ్ కుమార్, సందీప్ రాయ్ రాథోడ్ వున్నారు. అయితే ఈ ముగ్గురూ ప్రస్తుతం కేంద్ర సర్వీసుల పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. తరువాత ప్రమోద్‌కుమార్, అభయ్ కుమార్ సింగ్ వున్నప్పటికీ వారి పదవీ కాలం ఆరు నెలల కంటే తక్కువే వున్నందున వారి పేర్లను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకునేందుకు అవకాశం లేదు. ఇక మిగిలింది వన్నియ పెరుమాళ్, మహేష్‌కుమార్ అగర్వాల్, జి.వెంకట్రామన్, వినీత్ దేవాంగ్డే తదితరులు. దీంతో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్నదానిపై అధికార వర్గాల్లో చర్చనీయాంశమైంది. నిజానికి అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పోలీస్‌శాఖకు తాజాగా సవాళ్లు వచ్చిపడుతున్న నేపథ్యంలో పోలీస్‌శాఖను గాడినపెట్టే అధికారికే పగ్గాలు అప్పజెప్పాలని ప్రభుత్వం భావిస్తోంది.

ముస్తాబవుతున్న గంగైకొండచోళపురం

పరిశీలించిన మంత్రి శివశంకర్

చెన్నై, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనను పురస్కరించుకుని గంగైకొండచోళపురంలో భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. సుమారు పదివేల మంది కూర్చునేలా భారీ పందిరి నిర్మిస్తున్నారు. అదే విధంగా విశాలమైన వేదిక కూడా వేస్తున్నారు. అరియలూరు జిల్లా గంగైకొండచోళపురంలో రాజేంద్రచోళుడి జయంతి వేడుకలు, బృహదీశ్వరాలయ శంకుస్థాపన సహస్రాబ్ది వేడుకలు, రాజేంద్ర చోళుడు ఆగ్నేయ ఆసియా దేశాలపై జరిపిన దండయాత్ర సహస్రాబ్ది ఉత్సవాలు ఇలా 'ముప్పెరుం విళా' (త్రివిధ వేడుకల)లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ ఈ నెల 27న గంగైకొండచోళపురానికి రానున్నారు. ఈ వేడుకలో రాజేంద్రచోళుడి స్మారక నాణేన్ని విడుదల చేయనున్నారు. అదే విధంగా ఆ ప్రాంతంలో పురావస్తు పరిశోధన విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే ఫొటో ప్రదర్శన ప్రారంభిస్తారు.

తిరువాసగంపై ఇళయరాజా సింఫనీ...

ఆ తర్వాత ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా 'తిరువాసగం సింఫనీ' (ప్రత్యేక సంగీత విభావరి) నిర్వహించనున్నారు.



మోదీ సభలో పదివేల మంది కూర్చునేలా నిర్మిస్తున్న షామియానా

సుమారు అరగంటసేపు ప్రధాని మోదీ ఆ సింఫనీ సంగీత మాధుర్యాన్ని ఆస్వాదించనున్నారు. ఇక మోదీ గంగైకొండ చోళపుర బృహదీశ్వరలయంలో అడుగుపెట్టే సమయంలో 50 మంది ఓదువార్లు (స్వామివారి కీర్తనలను గానం చేసేవారు) తిరువాసగాన్ని శ్రావ్యంగా గానం చేయనున్నారు. ఈ వేడుకలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 38 మంది ఆధీనాలు (మఠాధిపతులు) పాల్గొననున్నారు. ప్రస్తుతం ఆలయ ప్రాంగణమంతటా పారిశుధ్య పనులు చురుకుగా సాగుతున్నాయి. ఈ వేడుకలలో అరియలూరు జిల్లా నలుమూలల నుండి భక్తులు వచ్చేందుకు ప్రత్యేక బస్సులను కూడా నడపనున్నారు.

మోదీ సభకు అట్టహాసంగా ఏర్పాట్లు

ప్రధాని నరేంద్రమోదీ కేరళ పర్యటన ముగించుకుని తిరువనంతపురం నుండి విమానంలో బయలుదేరి తిరుచ్చి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో గంగైకొండ చోళపురం ఆలయం సమీపంలోని హెలీపాడ్‌లో దిగుతారు. ప్రస్తుతం హెలీపాడ్ పనులు చురుకుగా సాగుతున్నాయి.

మంత్రి పరిశీలన...

రాజేంద్ర చోళుడి జయంత్యుత్సవాలకు సంబంధించి గంగైకొండచోళపురంలో చేపడుతున్న ఏర్పాట్లను సోమవారం ఉదయం రవాణా శాఖ మంత్రి శివశంకర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ వేడుకలు ఈ నెల 23న రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రారంభమవుతాయని, మంత్రులు తంగం తెన్నరసు, సామినాథన్, ఆర్.రాజేంద్రన్, పీకే శేఖర్‌బాబు, చిదంబరం ఎంపీ తొల్ తిరుమావళవన్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.



ఏర్పాట్లపై అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి శివశంకర్

అన్నదాతలను పట్టించుకోని డీఎంకే ప్రభుత్వం

● తిరువారూరులో ఈపీఎస్ ధ్వజం

చెన్నై, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో రైతుల సంక్షేమాన్ని డీఎంకే ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, వారికి ఎలాంటి సహాయాలు అందించలేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ధ్వజమెత్తారు. తిరువారూరులో సోమవారం ఉదయం రైతు సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఆ జిల్లాకు చెందిన రైతులతో ఈపీఎస్ భేటీ అయ్యారు. ఆ సందర్భంగా ఈపీఎస్ మాట్లాడుతూ.. డెల్టా జిల్లాలను సీఎం స్టాలిన్ విస్మరించారని, క్వింటాల్ ధాన్యానికి గిట్టుబాటు ధర ప్రకటించలేదని ఆరోపించారు. తన నాయకత్వంలో అన్నాడీఎంకే అధికారంలో ఉన్నప్పుడు డెల్టా జిల్లాలను సురక్షిత వ్యవసాయ క్షేత్రాలుగా ప్రకటించి, ఆ జిల్లాల్లోని రైతుల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేశానని చెప్పారు. డీఎంకే ప్రభుత్వమే డెల్టా జిల్లాల్లో మీథేన్ తవ్వకాలకు అనుమతించిందని, తన నాయకత్వంలోని అన్నాడీఎంకే ప్రభుత్వం ఆ తవ్వకాలు జరుగకుండా అడ్డుకుని రైతులను కాపాడిందని చెప్పారు. రాష్ట్రంలో మళ్ళీ అన్నాడీఎంకే అధికారంలోకి వచ్చాకే రైతుల జీవితాల్లో వెలుగులు వస్తాయన్నారు. 39 ఎంపీలు కలిగిన డీఎంకే ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం నుండి రైతు సంక్షేమం కోసం ఎలాంటి పథకాలను తెప్పించలేదని ఈపీఎస్ విమర్శించారు. వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే ప్రభుత్వ పతనం తప్పదని, తన ప్రచార పర్యటన సభలకు వస్తున్న లక్షలాదిమంది జనమే ఈ విషయాన్ని చాటిచెబుతోందన్నారు.



రైతు ప్రతినిధుల సమావేశంలో ప్రసంగిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

బాణసంచా కర్మాగారంలో అగ్నిప్రమాదం

ముగ్గురు కార్మికుల మృతి - మరో ముగ్గురికి గాయాలు



దట్టంగా కమ్ముకున్న పొగలు



నేలమట్టమైన గది

పెరంబూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): శివకాశి సమీపం నారాయణపురంలో వున్న ఓ బాణసంచా కర్మాగారంలో సోమవారం సాయంత్రం సంభవించిన అగ్నిప్రమాదంలో ముగ్గురు కార్మికులు మృతిచెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. నారాయణపురం-అనుప్పంకుళం రోడ్డులో మారియమ్మన్ ఫైర్ వర్క్స్ పేరుతో తిరుత్తంగల్ ప్రాంతానికి చెందిన శ్రీనివాసన్ బాణసంచా కర్మాగారం నిర్వహిస్తున్నాడు. నాగపూర్‌లోని పేసో అనుమతితో నడుపుతున్న కర్మాగారంలో సుమారు 40 గదుల్లో ఫాన్సీ రకం టపాసులు తయారుచేస్తుంటారు. ఈ నేపథ్యంలో, సోమవారం మధ్యాహ్నం 3.40 గంటల ప్రాంతాలో బాణసంచా తయారుచేస్తున్న ఓ గదిలో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. సమాచారం అందుకున్న శివకాశి అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపుచేసి గాయపడిన నాగలక్ష్మి, మారియమ్మాళ్, మరొక మారియమ్మాళ్ రక్షించి ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో కార్తీక్ (23) సహా ముగ్గురు సజీవదహనమయ్యారు. ఈ ఘటనపై శివకాశి తూర్పు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

సీఎం దిగ్భ్రాంతి...

శివకాశి సమీపం నారాయణపురం గ్రామంలోని బాణసంచా కర్మాగారం పేలుడు ఘటనపై సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... ఈ ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతో, తలా రూ.4 లక్షలు ఆర్థికసాయం, తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న వారికి రూ. లక్ష, స్వల్ప గాయాలైన వారికి రూ.50 వేలు అందజేయనున్నట్లు సీఎం తెలిపారు.



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సభ్యత్వం కోసం 'ఓటీపీ' అడుగుతారా?

● హైకోర్టు మదురై బెంచ్ ఆగ్రహం

చెన్నై, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతటా 'ఏకతాటిపై తమిళనాడు' పేరుతో డీఎంకే సభ్యత్వ నమోదు సందర్భంగా ప్రజల నుంచి 'ఓటీపీ' తీసుకోవడంపై హైకోర్టు మదురై ధర్మాసనం స్టే విధించింది. శివగంగ జిల్లా తిరుభువనం ప్రాంతానికి చెందిన రాజ్‌కుమార్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వాజ్యాన్ని పరిశీలించిన హైకోర్టు ఈ మేరకు ఆదేశాలిచ్చింది. డీఎంకే స్థానిక నాయకులు సభ్యత్వ కార్యక్రమాల పేరుతో ప్రజలను హింసిస్తున్నారని, తన ఇంటిలోని వారిని కూడా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని పిటిషనర్ ఆరోపించారు. సభ్యత్వ నమోదు సందర్భంగా డీఎంకే నేతలు కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డులు, ఓటరు గుర్తింపు కార్డులు, బ్యాంక్ పాస్‌బుక్ అడుగుతున్నారని, వీటిని ఇవ్వడానికి తన కుటుంబ సభ్యులు నిరాకరించగా, డీఎంకే ప్రభుత్వం నుంచి ప్రతినెలా గృహిణులకు ఇచ్చే రూ.1000ల నిలిపివేస్తామంటూ బెదిరించారన్నారు. సభ్యులుగా చేరే వారి నుంచి ఆధార్, ఓటరు గుర్తింపు కార్డుల నకళ్ళను తీసుకోవడమే కాకుండా వారి మొబైల్ నెంబర్లు కూడా నమోదు చేసుకుంటున్నారని, ఆ తర్వాత ఆయా ఫోన్ నెంబర్లకు ఓటీపీ ఎస్ఎంఎస్‌గా పంపి సభ్యత్వం ధ్రువీకరించుకోమంటూ అదే పనిగా మొబైల్‌ఫోన్లకు ఓటీపీలు పంపి విసిగిస్తున్నారని పిటిషనర్ ఆరోపించారు. ఆధార్ తదితర ధ్రువీకరణ పత్రాలను ప్రజల నుండి సేకరించడం రాజ్యాంగ ధర్మాసనానికి కూడా విరుద్ధమన్నారు. ఈ పిటిషన్ సోమవారం ఉదయం న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రమణ్యం, ఏటీ మరియా క్లాడ్‌తో కూడి ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ప్రజలను ఓటీపీ వివరాలను ఎట్టి పరిస్థితులలో ఎవరికీ తెలుపకూడదంటూ పోలీసుశాఖ హెచ్చరిస్తుండగా డీఎంకే నేతలు ఓటీపీలు కోరటం సబబేనా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిగత వివరాలను కాపాడటం రాజ్యాంగ ధర్మాసనం బాధ్యత అని, డీఎంకే సభ్యత్వ సేకరణ కార్యక్రమంలో ప్రైవేటు సంస్థ వ్యక్తిగత వివరాలను సేకరిస్తోందని కూడా పేర్కొన్నారు. ఓటరు వ్యక్తిగత వివరాలను కాపాడటం అవసరమని, కనుక డీఎంకే సభ్యత్వ కార్యక్రమంలో ఓటీపీలు అడగటంపై స్టే విధిస్తున్నామని న్యాయమూర్తులు తెలిపారు. అదే సమయంలో డీఎంకే నేతలు సభ్యత్వ కార్యక్రమాలను కొనసాగించవచ్చునని, ఓటీపీ కోరవద్దని స్పష్టం చేశారు. అంతే కాకుండా ఈ కేసులో కేంద్ర ఎన్నికల సంఘాన్ని ప్రతివాదిగా చేర్చుతున్నామని, డిజిటల్ పద్ధతిలో వ్యక్తిగత సమాచారాన్ని ఎలా సంరక్షిస్తున్నారో తమకు స్పష్టం చేయాలన్నారు. ఈ పిటిషన్‌కు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించి, తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు.



సమాచార దృష్టి

రామేశ్వరానికి ప్రత్యేక బస్సులు

పెరంబూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆడి అమావాస్యను పురస్కరించుకుని రామేశ్వరానికి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) తెలిపింది. ఈ మేరకు ఎస్ఈటీసీ విడుదల చేసిన ప్రకటనలో... ఈ నెల 23న చెన్నై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, కోయంబత్తూర్, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి రామేశ్వరానికి, 24న రామేశ్వరం నుంచి చెన్నై, సేలం, కోవై, బెంగళూరు ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు తెలిపింది. ప్రజలు www.tnstc.in అనే వెబ్‌సైట్, tnstc అనే యాప్ ద్వారా టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకోవాలని ఎస్ఈటీసీ తెలిపింది.

24, 31 తేదీల్లో ఆలస్యంగా పినాకినీ ఎక్స్‌ప్రెస్

పెరంబూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): చెన్నై డివిజన్ పరిధిలోని రైలు మార్గాలో మరమ్మతుల కారణంగా చెన్నై సెంట్రల్-విజయవాడ పినాకినీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 24, 31వ తేదీల్లో ఆలస్యంగా బయల్దేరనుంది. ఆ ప్రకారం, చెన్నై సెంట్రల్ నుంచి 24వ తేది మధ్యాహ్నం 2.05 గంటలకు బదులు గంట ఆలస్యంగా 3.05 గంటలకు, 31న గంటన్నర ఆలస్యంగా 3.35 గంటలకు బయల్దేరి వెళుతుందని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

కార్పొరేషన్ ప్రాంతాల్లో పార్కింగ్ ఛార్జీలకు బ్రేక్

టి.నగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌కు సంబంధించిన పార్కింగ్ స్థలాల్లో సోమవారం నుండి వాహనాల పార్కింగ్ ఛార్జీలను చెల్లించనవసరం లేదని అధికారులు ప్రకటించారు. పార్కింగ్ స్థలాల్లో రుసుము వసూలు చేయడానికి మాజీ సైనికోద్యోగుల సంఘంతో కుదుర్చుకున్న ఒప్పందం గడువు ఆదివారం ముగియడంతో కొత్త ఒప్పందం కుదుర్చుకునేంత వరకు వాహన చోదకులు పార్కింగ్ స్థలాలకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు.

మెరీనా బీచ్ శుభ్రతకు వంద మంది కార్మికులు

పెరంబూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా బీచ్‌ను వంద మంది పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించనున్నారు. యుద్ధ స్మారక స్థూపం నుండి లైట్ హౌస్ వరకు 2.4 కి.మీ దూరం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటలు, 2 గంటల నుంచి రాత్రి 10 గంటలు అని రెండు షిఫ్టుల్లో శుభ్రం చేయించనున్నారు. ఉదయం 70 మంది, మధ్యాహ్నం 30 మంది పాల్గొంటారని, ప్రజలు కూడా బీచ్ శుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని చెన్నై కార్పొరేషన్ విజ్ఞప్తి చేసింది.

రెండు నెలల్లో రోడ్ల పనులు పూర్తి

పెరంబూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో చేపట్టిన రోడ్ల పనులు సెప్టెంబరు చివరి నాటికి పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. నగరంలో గతంలో కురిసిన వర్షాలకు రోడ్లు తీవ్రంగా దెబ్బతిని, వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో, వర్షాకాలం ప్రారంభం నాటికి రోడ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని నిర్ణయించిన జీసీసీ, గత నెల నుంచి పనులు ప్రారంభించింది. ప్రస్తుతం 25 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు సెప్టెంబరు నాటికి పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని జీసీసీ ఉత్తర్వులు జారీచేసింది.

మేట్టూరుకు పెరిగిన ఇన్‌ఫ్లో

పెరంబూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా మేట్టూరు డ్యాంకు ఇన్ ఫ్లో పెరిగింది. సోమవారం ఉదయం డ్యాంకు 31,500 ఘనపుటడుగుల నీరు వస్తుండగా, అదే స్థాయిలో కిందకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యాం 120 అడుగుల పూర్తి సామర్థ్యంతో 93.47 టీఎంసీల నీరుందని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

మరో 36 పార్కుల్లో గ్రంథాలయాలు

పెరంబూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మరో 36 పార్కుల్లో గ్రంథాలయాలు ఏర్పాటుచేయాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) నిర్ణయించింది. ప్రజల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేలా పార్కుల్లో గ్రంథాలయాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించిన జీసీసీ, రాయపురం మండల పరిధిలోని చూలై ఏబీ రోడ్డు సమీపం రాఘవేంద్ర పార్క్, చింతాద్రిపేటలోని మే డే పార్కులో ప్రయోగాత్మకంగా గ్రంథాలయాలు ఏర్పాటుచేసింది. పార్కులో వాకింగ్ చేసేవారు, సాయంత్రం పిల్లలతో వచ్చే తల్లిదండ్రులు ఈ గ్రంథాలయంలోని పుస్తకాలను ఆసక్తిగాన చదువుతున్నారు.. పిల్లల కార్టూన్, చిన్న కథలు సహా పలు విభాగాల్లో 300లకు పైగా పుస్తకాలు ఈ గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్నాయి. ఈ గ్రంథాలయాలకు ప్రజాదరణ లభించడంతో మరో 36 పార్కులో ఏర్పాటుచేయాలని జీసీసీ నిర్ణయించింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పూందమల్లి: పూందమల్లి మున్సిపాలిటీ, సెన్నీర్ కుప్పం, కరయాన్‌చావిడి, తులసీదాస్ నగర్, చిన్నమాంగాడు, కుమనన్‌చావిడి.

నీలాంగరై: పాత గణేష్ నగర్ మెయిన్ రోడ్డు 5 నుంచి 11 వీధులు, శ్రీ కర్పగ వినాయగర్ నగర్, మహాత్మాగాంధీ నగర్, రామలింగ నగర్, గోపినాథ్ అవెన్యూ, నారాయణ నగర్, తిరువళ్లువర్ నగర్, భారతి వీధి, కామరాజర్ వీధి, సెంతామరై కన్నన్ నగర్, రాజేంద్ర నగర్ 11వ వీధి, ఈస్ట్‌కోస్ట్ రోడ్డు, వెట్టువాంకేని మెయిన్ రోడ్డు.

అడయార్: శాస్త్రి నగర్, ఎల్బీ రోడ్డు, కళాక్షేత్ర రోడ్డు, ఆర్కే నగర్, శ్రీరామ్ నగర్, శాంతి అవెన్యూ, శివసుందర్ అవెన్యూ. **అంబత్తూర్:** మేనంబేడు, కల్లికుప్పం, భాను నగర్, పుదూర్, చంద్రశేఖరపురం, ఒరగడం, కారుక్కు, రెడ్‌హిల్స్ రోడ్డు.

సెంబియం: ఎంహెచ్ రోడ్డు, కామరాజ్ రోడ్డు, మూలక్డై, గాంధీ నగర్ 1 నుంచి 5 వీధులు, జంబులి వీధి.

హొగెనేకల్‌లో దోనెల సవారీకి అనుమతి

పెరంబూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): హొగెనేకల్ జలపాతానికి వస్తున్న నీరు తగ్గడంతో దోనెల సవారీకి జిల్లా యంత్రాంగం అనుమతించింది. కర్ణాటక రాష్ట్రంలోని కబిని, కృష్ణరాజసాగర్ డ్యాంలు పూర్తిస్థాయికి చేరువ కావడంతో ఆ డ్యాం నుంచి అదనపు జలాలను కావేరి నదిలోకి విడుదల చేస్తున్నారు. ఈ నీరు హొగెనేకల్ జలపాతాల వద్ద ఆదివారం ఉదయం 43వేల ఘనపుటడుగులకు చేరడంతో, పర్యాటకుల భద్రత దృష్ట్యా దోనె సవారీ, జలపాతాల వద్ద వెళ్లేందుకు నిషేధం విధించారు. సాయంత్రం 32వేల ఘనపుటడుగులకు తగ్గిన నీరు, సోమవారం ఉదయం 20,000 ఘనపుటడుగులుగా నమోదైంది. దీంతో, హొగెనేకల్ కావేరి నదిలో దోనెల సవారీకి అనుమతించినట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది.

అర్ధరాత్రి రవాణా శాఖ మంత్రి తనిఖీలు

నేమ్‌బోర్డు లేని బస్సు సిబ్బందిపై ఆగ్రహం ● ఆమ్నీ బస్సు హారన్ తొలగింపు

చెన్నై, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లా మామండూరు వద్ద సోమవారం వేకువ జాము రవాణా శాఖ మంత్రి శివశంకర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చెన్నై - తిరుచ్చి రహదారిలో మామండూరు వద్ద నిలబడి ఆ మార్గంలో వెళుతున్న బస్సులను పరిశీలించారు. రాష్ట్ర రవాణా సంస్థకు చెందిన ఎక్స్‌ప్రెస్ సర్వీసు బస్సు ఏ వూరికి వెళ్తుందో తెలిపే నేమ్‌బోర్డు లేకపోవడాన్ని మంత్రి గమనించి ఆ బస్సును నిలిపారు. కండెక్టర్, డ్రైవర్లను కిందకు దింపి నేమ్‌బోర్డు లేకుండా బస్సును ఎలా నడుపుతారని ప్రశ్నించారు. ఆ ప్రశ్న అడుగుతున్నది మంత్రి అని తెలియక కండెక్టర్, డ్రైవర్ పెద్దగా పట్టించుకోలేదు. ఆ తర్వాత తానెవరో శివ శంకర్ చెప్పగానే ఇద్దరికీ చెమటలు పట్టాయి.



నేమ్‌బోర్డు లేకుండా వెళుతున్న బస్సు ఆపి సోదా చేస్తున్న మంత్రి శివశంకర్ - ఆమ్నీ బస్సు హారన్ తొలగిస్తున్న మంత్రి

ఇకపై నేమ్‌బోర్డు లేకుండా బస్సులు నడుపకూడదని హెచ్చరించారు. అనంతరం ఆ రహదారిలో ఓ ఆమ్నీ బస్సు నుండి హారన్ శబ్దం ప్రభుత్వం నిర్ణయించినదాని కంటే అధికంగా ఉందని తెలుసుకున్నారు. వెంటనే ఆ బస్సును ఆపి అందులోని హారన్ మంత్రి తొలగించారు. ఆ తర్వాత తాను రవాణా శాఖ మంత్రినని చెప్పటంతో ఆమ్నీ బస్సు సిబ్బంది దిగ్భ్రాంతికి గురయ్యారు.

కేరళ మాజీ సీఎం మృతికి స్టాలిన్ సంతాపం

చెన్నై, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ మృతికి సీఎం స్టాలిన్ సంతాపం తెలిపారు. ఈ మేరకు సీఎం తన ఎక్స్‌లో... వీఎస్ అచ్యుతానందన్ మృతితో బాధపడుతున్న ఆయన కుటుంబ సభ్యులు, భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) కార్యకర్తలకు, కేరళ రాష్ట్ర ప్రజలకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు సీఎం స్టాలిన్ ట్వీట్ చేశారు.

బీజేపీ ఎవరినీ మోసం చేసే... మోసపోయే పార్టీ కాదు

● బీజేపీ నేత అన్నామలై

పెరంబూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎవరినీ మోసం చేసే పార్టీ కాదని, అలాగని మోసపోయే పార్టీ కాదని బీజేపీ నేత అన్నామలై తెలిపారు. కోయంబత్తూర్ నుంచి నగరానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ... మా పార్టీకి ఒక లక్షణం ఉందని, మేము ఎవరినీ ఓడించమని, ఏ పార్టీని కిందకు నెట్టి ఎదగాలని కోరుకోమన్నారు. అదే సమయంలో మేము బలపడానికి కోరుకుంటామన్నారు. ఈ కూటమి ఏర్పాటులో తన ప్రమేయం లేదన్నారు. కానీ, డీఎంకేను గద్దెదింపాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. కూటమికి వ్యతిరేకంగా తాను ఎన్నడూ మాట్లాడలేదన్నారు. కోయంబత్తూర్‌లో ఎడప్పాడి పళనిస్వామి తన పర్యటన ప్రారంభించిన సమయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర సహాయ మంత్రి పాల్గొన్నారన్నారు. నాకంటూ ఒక మర్యాద ఉందని, ఆహ్వానం లేకుండా అనవసర వేదికలకు వెళ్లనన్నారు. పదవుల కోసం తాను ఎన్నడూ వెంట పడలేదని, రాష్ట్ర అధ్యక్షుడి పదవి ఉల్లిపాయ వంటిదని మాత్రమే అన్నానని అన్నామలై పేర్కొన్నారు.

శివాజీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ అన్నదానం


పెరంబూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): 'నడిగర్ తిలగం' శివాజీ గణేశన్ 24వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సత్యమూర్తి భవన్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు కృష్ణన్‌స్వామి, కేవీ తంగబాలు తదితరులు పాల్గొన్నారు. మొదట ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే హసన్‌మౌలానా నేతృత్వంలో అన్నాసాలై దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ మాజీ అధ్యక్షులు పీటర్ అల్ఫోన్స్, పార్టీ కోశాధికారి, ఎమ్మెల్యే రూబి మనోహరన్, ఉపాధ్యక్షులు బలరామన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సెల్వం సహా పలువురు నేతలు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ఆలయాలు కూల్చివేత


కూల్చివేసిన ఆలయాలు

పెరంబూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మధురాంతకం సమీపం మేట్టుపాళయం ప్రాంతంలో ప్రభుత్వ స్థలం ఆక్రమించి నిర్మించిన ఆలయాలను న్యాయస్థానం ఉత్తర్వులతో కూల్చివేశారు. మేట్టుపాళయంలో శనీశ్వరుడు, శివాలయం, అమ్మవారి, అయ్యప్ప, వినాయక ఆలయాలున్నాయి. ఈ ఆలయాలను మురుగయ్యాన్ అనే వ్యక్తి పర్యవేక్షిస్తున్నాడు. ఈ నేపథ్యంలో, ప్రభుత్వ స్థలం ఆక్రమించి ఆలయాలు నిర్మించినట్లు సోత్తుపాక్కానికి చెందిన సమాజసేవకుడు రాజా దాఖలుచేసిన పిటిషన్ విచారించిన మద్రాసు హైకోర్టు, ఆరు నెలల్లో ఆక్రమణ ఆలయాలు తొలగించాలని రెవెన్యూ అధికారులకు ఉత్తర్వులు జారీచేసింది. దీంతో, ఆలయాలు తొలగించాలంటూ మధురాంతకం రెవెన్యూ శాఖ, ఆలయ నిర్వాహకులు మురుగయ్యాన్‌కు పలుమార్లు నోటీసులు ఇచ్చారు.. ఈ క్రమంలో, మురుగయ్యాన్ శనివారం ఒకటి తర్వాత మరొకటి ఆలయాలు ధ్వంసం చేసి, ఆలయాల్లో ఉంచిన విగ్రహాలు భద్రంగా తీసుకెళ్లారు.

తిరుత్తణిలో భారీవర్షం



తిరుత్తణి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో సోమవారం ఉదయం కురిసిన వర్షానికి మురుగన్ ఆలయానికి వెళ్ళే నడక మార్గంలో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆదివారం ఆడి కృతిక సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో పోటెత్తారు. ఈ నేపథ్యంలో, సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి కొండలోతొట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షాకాలంలో కొండపైనుంచి వచ్చే వరదనీటి వల్ల కొండ దిగువన ఉండే ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నామని వాపోతున్నారు. దీనిపై అధికారులు స్పందించి కొండపైనుంచి వచ్చే వర్షపు నీటిని తరలించేందుకు డ్రైనేజీ లైన్లను ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

రాష్ట్రంలో తగ్గిన 50 ఎంబీబీఎస్ సీట్లు

టి.నగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుత విద్యాసంవత్సరంలో 50 ఎంబీబీఎస్ సీట్లను తగ్గిస్తూ మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) ఉత్తర్వులిచ్చింది. కాంచీపురం జిల్లా ఒరగడంలోని పీఎస్‌పీ వైద్యకళాశాలలో ఉన్న 150 ఎంబీబీఎస్ సీట్ల సంఖ్యను 100కు తగ్గించింది. జాతీయ వైద్యమండలి నిబంధనలను సక్రమంగా పాటించకపోవడంతో ఎంసీసీ ఈ చర్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. పీఎస్‌పీ వైద్య కళాశాల నిర్వాహకులు ఈ యేడాది తమకళాశాలలలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్యను 150 నుండి 250 సీట్లకు పెంచాలని కోరుతూ జాతీయ వైద్య విద్యా మండలికి దరఖాస్తు చేసుకున్నారు.. అయితే ఎంసీసీ ఆ దరఖాస్తు తోసిపుచ్చి ఆ కళాశాలలలో వంద సీట్లకే అడ్మిషన్లు జరిగేలా చర్యలు చేపట్టాలంటూ తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ వైద్యవిశ్వవిద్యాలయం రాష్ట్ర వైద్యవిద్యా మండలికి సూచించింది. ఎంసీసీ ఉత్తర్వుల ప్రకారం దేశవ్యాప్తంగా 766 కళాశాలలలో 1,15,900 ఎంబీబీఎస్ సీట్లకు అడ్మిషన్లు జరుగుతాయి. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, చత్తీస్‌ఘడ్, ఢిల్లీ, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఉన్న వైద్య కళాశాలలలో ఎంబీబీఎస్ సీట్లను పూర్తిస్థాయిలో అడ్మిషన్లు జరుపుకునేందుకు అనుమతించింది. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యకళాశాలలు, ప్రైవేటు వైద్యకళాశాలలు, డీమ్డ్ విశ్వవిద్యాలయాలు, మదురై ఎయిమ్స్, కోయంబత్తూరు ఈఎస్ఐ వైద్యకళాశాలలు సహా మొత్తం 77 కళాశాలలకు సంబంధించిన ఎంబీబీఎస్ సీట్ల వివరాలను కూడా వెల్లడించారు. ఆ ప్రకారం 12,000 సీట్లకుగాను కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్లు జరుగనున్నాయి.

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ 'సూపర్ పోలీస్' కాదు...!

● హైకోర్టు

పెరంబూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తమ దృష్టికి వచ్చే అన్నింటినీ విచారించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) 'సూపర్ పోలీస్' కాదని మద్రాసు హైకోర్టు ఖండించింది. 2006లో నేలబొగ్గు కేటాయింపులో జరిగిన అవినీతికి సంబంధించి సుప్రీంకోర్టు ఉత్తర్వులతో, నగరానికి చెందిన ఆర్కేఎం పవర్‌జెన్ సంస్థకు వ్యతిరేకంగా సీబీఐ కేసు నమోదుచేసింది. అలాగే, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా కేసు నమోదుచేసింది. ఈ కేసులో సీబీఐ దాఖలుచేసిన అదనపు నివేదిక ఆధారంగా జనవరిలో ఆర్కేఎం పవర్‌జెన్ సంస్థకు సంబంధించిన ప్రాంతాల్లో తనిఖీలు చేసిన ఈడీ, ఈ సంస్థకు చెందిన రూ.901 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లను స్తంభింపజేసింది. ఈడీ చర్యలకు వ్యతిరేకంగా ఆర్కేఎం సంస్థ మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌ను న్యాయమూర్తులు ఎంఎస్ రమేష్, వి.లక్ష్మీనారాయణన్‌లతో కూడిన ధర్మాసనం విచారించి జారీ చేసిన ఉత్తర్వుల్లో... ఈ కేసులో ఎలాంటి ఫిర్యాదు నమోదుకాలేదు. తమ దృష్టికి వచ్చే ప్రతిదానిని దర్యాప్తు చేసేందుకు ఈడీ సూపర్ పోలీస్ కాదని ఖండిస్తూ, సంస్థ డిపాజిట్లు స్తంభింపజేస్తూ జారీ చేసిన ఈడీ ఉత్తర్వులు రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీచేశారు.

పొత్తుకు వస్తే డిప్యూటీ సీఎం ఇస్తామన్నారు

● డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్

పెరంబూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పదవి, ఎక్కువ స్థానాలు ఇస్తామని ఎడప్పాడి పళనిస్వామి తమను ఆహ్వానించారని డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ తెలిపారు. చెంగల్పట్టు జిల్లా మరమలై నగర్‌లో 'మతసామరస్యం' పేరుతో ఆదివారం నిర్వహించిన సభలో తిరుమాళవన్ మాట్లాడుతూ... డీఎంకే కూటమిని విచ్ఛిన్నం చేయాలని అన్నాడీఎంకే-బీజేపీ కుటిల ప్రయత్నాలు చేపట్టాయన్నారు. డీఎంకే కూటమి సీట్లు, విజయాల కోసం ఏర్పాటైంది కాదని, మతవాత శక్తులను అడ్డుకొనే లక్ష్యంతో పనిచేస్తుందన్నారు. తమకు పదవులు ముఖ్యం కాదని, ప్రజలకు మంచి చేయాలన్నదే లక్ష్యమన్నారు. అదే సమయంలో మతవాత శక్తులను అడ్డుకోవడం ప్రధాన కర్తవ్యమన్నారు. డీఎంకే కూటమి పార్టీలకు ఆశచూపి వాటిని తమవైపు తిప్పుకోవాలని పళనిస్వామి పాకులాడుతున్నారని తిరుమావళవన్ ఆరోపించారు.

వర్షబాధితుల కోసం ముందస్తు ఏర్పాట్లు

● 169 ప్రాంతాల్లో సహాయ శిబిరాలు

టి.నగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ నగరంలో వర్షబాధితుల కోసం ముందస్తు ఏర్పాట్లను ప్రారంభించింది. వర్షాలకు నీట మనిగే ప్రాంతాలను గుర్తించి అక్కడి వర్షబాధితులను వీలైనంత త్వరగా కాపాడేలా సమీప ప్రాంతాల్లో సురక్షిత సహాయ శిబిరాలను ఏర్పాటు చేయనుంది. ఆ మేరకు నగరంలో 169 ప్రాంతాల వద్ద వర్షబాధితుల సహాయ శిబిరాలను నిర్వహించాలని నిర్ణయించింది. ఆ శిబిరాల్లో వర్షబాధితులకు ఆహారం తదితర సదుపాయాలు కల్పించేందుకు కూడా సిద్ధమవుతోంది. ప్రస్తుతం నగరమంతటా వాననీటి కాల్వల్లో పేరుకుపోయిన వ్యర్థాలను యుద్ధ ప్రాతిపదికన తొలగిస్తున్నారు. గత యేడాది వర్షాలకు వరద పరిస్థితులను ఎదుర్కొన్న 87 ప్రాంతాలను గుర్తించి, ప్రస్తుతం ఆ ప్రాంతాల్లో నివసించే వారిని సకాలంలో సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయనుంది. ప్రస్తుతం 600 చోట్ల దెబ్బతిన్న మురుగునీటి కాల్వలు, వాననీటి కాల్వలలో పూడిక తీత పనులను కూడా పూర్తి చేసింది. ఇలా పకడ్బందీ ఏర్పాట్లతో నైరుతి రుతుపవన ప్రభావిత వర్షాల వల్ల కలిగే వరద పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధమవుతోంది.

ఆరంబాక్కంలో బాలికపై అత్యాచారం కేసు

● నిందితుడి ఫొటో, వీడియో విడుదల

టి.నగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపంలోని ఆరంబాక్కం వద్ద ఒంటరిగా నడచివెళుతున్న బాలికను వెంబడించి, నిర్బంధించి అత్యాచారానికి పాల్పడిన సంఘటనలో నిందితుడి ఫొటోలు, వీడియోను జిల్లా పోలీసులు విడుదల చేశారు. బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు చూడటానికి ఉత్తరాది యువకుడిలా ఉన్నాడు. సీసీ ఫుటేజీలో


సీసీ ఫుటేజీ నుంచి సేకరించిన నిందితుడి ఫొటోలు

లభించిన ఈ ఫొటోలను విడుదల చేసిన పోలీసులు అతడి ఆచూకీ తెలిస్తే 9952060948 మొబైల్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.. గుమ్మిడిపూండి సమీపంలోని ఆరంబాక్కంలో ఈ నెల 12 సాయంత్రం ఆ రహదారిలో నడచి వెళుతున్న బాలికను గుర్తు తెలియని యువకుడు వెంబడించి అత్యాచారం చేసి పారిపోయాడు. ఆ తర్వాత వంటి నిండా గాయాలతో ఇంటికి చేరుకున్న బాలిక జరిగిన విషయాన్ని బామ్మకు చెప్పింది. దీంతో ఆ బాలికను చికిత్స కోసం పొన్నేరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి బాలికపై అత్యాచారం జరిగినట్లు నిర్ధారించడంతో మెరుగైన చికిత్స కోసం చెన్నైలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కోలుకోవడంతో ఆ బాలికను శనివారం సాయంత్రం డిశ్చార్జ్ చేశారు. ఈ సంఘటనపై బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి, తిరువళ్లూరు ఎస్పీ నేతృత్వంలో ముగ్గురు డీఎస్పీల పర్యవేక్షణలో 8 ప్రత్యేక పోలీసు బృందాలు నిందితుడి ఆచూకీ కోసం గాలిస్తున్నాయి. పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేయడానికి ప్రత్యేక దళం పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్న నేపథ్యంలో సీసీ ఫుటేజీ ఆధారంగా నేరానికి పాల్పడిన యువకుడి ఫొటోలు, వీడియోలను తిరువళ్లూరు జిల్లా పోలీసులు విడుదల చేశారు. అతడి ఆచూకీ తెలిస్తే వెంటనే తమకు తెలియజేయాలని ప్రకటన చేశారు.

మహిళలకు కుట్టు మెషీన్ల పంపిణీ

వేలూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజలు వినతిపత్రాలను అందజేశారు. అనంతరం కలెక్టర్ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమశాఖ తరుపున ఇద్దరు మహిళలకు కుట్టు మెషీన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కౌసల్య, రూరల్ డెవెలెప్మెంట్ డైరెక్టర్ కాంచన, తహసీల్దార్ సెంథిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కుట్టు మెషీన్ అందజేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

బాలికపై లైంగిక వేధింపులు

వృద్ధుడి అరెస్ట్

వేలూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బాలికపై 70 ఏళ్ల వృద్ధుడు లైంగిక వేధింపులకు గురిచేసిన సంఘటన వేలూరు జిల్లా గుడియాత్తం సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే అమ్మన్‌కుప్పన్ దుర్గానగర్‌కు చెందిన మేకల కాపరి ఆర్ముగం (70) ఆదివారం రాత్రి ఓ ఇంట్లో ఒంటరిగా ఉన్న విద్యార్థినిని లైంగిక వేధింపులకు గురిచేసి, ఈ విషయం గురించి ఎవరికైనా చెబితే చంపేస్తానని ఆ బెదిరించినట్లు సమాచారం. బాలిక తన తల్లికి చెప్పడంతో గుడియాత్తం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఆర్ముగంను అరెస్టు చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

కందిరీగల దాడిలో దంపతుల మృతి

చెన్నై, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా సెంగోట్టై శివనల్లూరు ప్రాంతంలో విషపు కందిరీగలు దాడి చేయడంతో వృద్ధ దంపతులు మృతి చెందారు. సెంగోట్టై సమీపంలోని ఓ ఆలయ వేడుకల్లో ఆదివారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు అన్నదానం చేస్తున్న ప్రాంతానికి నడిచివెళుతుండగా మార్గమధ్యంలో కొబ్బరితోట వద్ద కందిరీగలు వారిపై దాడి చేశాయి. ఐదుగురు భక్తులు కందిరీగలు కట్టడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిలో షణ్ముగం పిళ్లై (85), ఆయన భార్య మహరాశి (78) అనే వృద్ధ దంపతులు చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. ఇదే విధంగా కందిరీగలు కట్టడంతో ముగ్గురి ఆరోగ్యపరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు.

అమ్మ క్యాంటీన్‌లో వంట పాత్రలు, సిలిండర్ల చోరీ

● ఇద్దరు బాలురు సహా ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పటాలంలోని అమ్మ క్యాంటీన్‌లో వంట పాత్రలు, సిలిండర్లు చోరీ చేసిన కేసులో ఇద్దరు బాలురు సహా ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. డీమల్స్ రోడ్డు సమీపంలోని అమ్మ క్యాంటీన్ భూగర్భ డ్రైనేజీ పనుల కారణంగా రెండు నెలలుగా మూతపడింది. ఈ నెల 2వ తేది మళ్లీ క్యాంటీన్ తెరిచిన ఉద్యోగులు, క్యాంటీన్‌లోని వంట సామగ్రి, 8 గ్యాస్ సిలిండర్లు అదృశ్యం కావడం గమనించి బేసిన్ బ్రిడ్జి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు, వ్యాసర్పాడి మూర్తింగర్ వీధికి చెందిన సంజయ్ అలియాస్ పోట్టు సంజయ్, ఇద్దరు బాలురను అరెస్ట్‌చేసి, వారి నుంచి వంట పాత్రలు, సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన సంజయ్‌ను కోర్టులో హాజరుపరచి జైలుకు, ఇద్దరు బాలురను జువైనల్ హోంకు తరలించినట్లు గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ సోమవారం ప్రకటన విడుదల చేసింది.

కొలనులో పడి విద్యార్థి మృతి

పెరంబూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆలయ కొలనులో పడి పాఠశాల విద్యార్థి మృతిచెందిన ఘటన మనలి పుదునగర్‌లో చోటుచేసుకుంది. మనలి పుదునగర్ విచ్చూర్ ప్రాంతానికి చెందిన మదియళగన్-శశి దంపతుల కుమారుడు రోహిత్ రోషిన్ (10) 5వ తరగతి చదువుతున్నాడు. ఘటన జరిగిన రోజున అదే ప్రాంతంలోని చెల్లియమ్మన్ ఆలయ కొలను గట్టుపై కూర్చున్న రోహిత్ కాలు జారి నీటిలో పడ్డాడు. ఈత రాకపోవడంతో మునిగాడు. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ఈ విషయం తెలియలేదు. సాయంత్రం రోహిత్ మృతదేహం నీటిపై తేలడంతో చుట్టుపక్కల వారు గమనించి మనలి పుదునగర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టంకు తరలించి ఘటనపై కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

బంధువుల ఇంట్లో 13 సవర్ల చోరీ

● న్యాయవాది సహా ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నాంగునేరి సమీపంలో బంధువుల ఇంట్లో నగలు చోరీ చేసిన తల్లి, కుమార్తె, వాటిని తాకట్టు పెట్టి వాటా తీసుకున్న న్యాయవాదిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరునల్వేలి జిల్లా సీలాత్తికుళం ప్రాంతానికి చెందిన పొన్నమ్మాళ్ (45), కుమార్తె నందినిసుధ (19) కలసి, కీలకరంగాడు గ్రామంలోని బంధువు నాగమ్మాళ్ ఇంట శనివారం జరిగిన శుభకార్యానికి వెళ్లారు. కార్యక్రమం అనంతరం అందరూ వెళ్లిన తర్వాత నాగమ్మాళ్ బీరువా తెరవగా, అందులోని 13 సవర్ల నగలు మాయం కావడంతో ఆదివారం ఉదయం నాంగునేరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై విచారణ చేపట్టిన పోలీసులు, ఇంటికి కొత్తగా ఎవరైనా వచ్చారా? అన్ని ప్రశ్నించగా, పొన్నమ్మాళ్, ఆమె కుమార్తె వచ్చి వెళ్లారని నాగమ్మాళ్ తెలిపింది. దీంతో, మధ్యాహ్నం సీలాత్తికుళం వెళ్లిన పోలీసులు, పొన్నమ్మాళ్, కుమార్తె నందిని సుధను అదుపులోకి తీసుకుని విచారించగా, నగలు చోరీచేసినట్లు అంగీకరించారు. చోరీచేసిన నగలను న్యాయవాది మణికంఠన్‌కు ఇవ్వగా, ఆయన వాటిని తాకట్టుపెట్టి వచ్చిన డబ్బులు మూడు వాటాలుగా పంచుకున్నట్లు అంగీకరించారు. దీంతో, మణికంఠన్, పొన్నమ్మాళ్, నందినిసుధను అరెస్ట్ చేసిన పోలీసులు, వారిని కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

ఇంటి ముందు పుర్రె, ఎముకలు

● వడపళనిలో కలకలం


ఇంటి ముందు పుర్రె, ఎముకలు

పెరంబూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళనిలోని ఓ ఇంటి ముందు మనిషి పుర్రె, ఎముకలు ఉండడం కలకలం రేపింది. సోమసుందర్ భారతియార్ నగర్‌లో ఉంటున్న కరుణాకరన్ ఇంటి నుంచి బయటకు రాగా, ఇంటి ముందు మనిషి పుర్రె, ఎముకలు ఉండడం గమనించి కేకలు పెట్టాడు. చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని వాటిని చూసి దిగ్భ్రాంతి చెందారు. సమాచారం అందుకున్న వడపళని పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. కరుణాకరన్ ఇంటి సమీపంలో శ్మశానవాటిక ఉండడంతో, అక్కడి నుంచి వీటిని ఎవరైనా తీసుకొచ్చి పడేశారా? లేక క్షుద్ర పూజలు చేశారా? అనే కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు.

కలెక్టరేట్ ముందు వృద్ధుడి ఆత్మహత్యాయత్నం


వృద్ధుడిపై నీరు పోస్తున్న పోలీసులు

వేలూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం ఉద యం 73 యేళ్ల వృద్ధుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలిలా... సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయం ముందు కాశీ (73)అనే వృద్ధుడు శరీరంపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. అడ్డుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా, తనకు అనైకట్టుకు చెందిన దామోదరన్ అనే వ్యక్తికి మధ్య భూ వివాదాలున్నాయని, తనను భూమి విషయంలో తీవ్ర ఇబ్బందులకుగురి చేస్తున్నాడన్నాడు. దీనిపై గత కొన్ని రోజులుగా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశానని, అయినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆత్మహత్యాయత్నానికిఇ పాల్పడినట్లు కాశీ పోలీసుల ముందు వాపోయాడు. విషయం తెలుసుకున్న సబ్ కలెక్టర్ సెంథిల్‌కుమార్ ఆ వృద్ధుడి ఫిర్యాదు తీసుకుని త్వరలోనే తగు పరిష్కారం చూపుతామని తెలిపారు.

అదనపు కట్నం కోసం భార్యకు వేధింపులు

● అంబులెన్స్‌లో వచ్చి కలెక్టర్‌కు ఫిర్యాదు


అంబులెన్స్‌లో కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన మహిళ

వేలూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా సైదాపేటకు చెందిన నర్గీస్ అనే మహిళ సోమవారం ఉదయం అంబులెన్స్‌లో కలెక్టర్ కార్యాలయానికి వచ్చింది. ఆమెకు సైదాపేటకు చెందిన రాజారవి అనే వ్యక్తితో 2023లో వివాహమైంది. కట్నంగా ఆమె తల్లిదండ్రులు 30సవర్ల బంగారం, 500గ్రాముల వెండి, 6 లక్షల నగదు ఇచ్చారు. ఈ నేపథ్యంలో నర్గీస్‌ను అదనంగా మరో 10 లక్షలు కట్నం తీసుకురావాలని తిరువణ్ణామలైలో పోలీసు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రాజారవి తండ్రి నిత్యం వేధిస్తున్నాడని సమాచారం. ఈ క్రమంలో నర్గీస్ మీడియాతో మాట్లాడుతూ, కొద్దిరోజు క్రితం ఇంటి మిద్దెపై నుంచి నర్గీస్ అదనపు కట్నం తీసుకురాలేని కక్షతో కిందికి తోసేశారని, తీవ్ర గాయాలైన ఆమెను చుట్టుపక్కల వారు ఆస్పత్రికి తరలించారని తెలిపింది. దీనిపై నర్గీస్ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె వాపోయారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను ఆమె అత్త,మామలు కేసు వాపసు తీసుకోమని బెదిరిస్తున్నారని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయదలుచుకుని ఇక్కడి వచ్చినట్లు ఆమె తెలిపారు. అనంతరం కలెక్టర్ సుబ్బులక్ష్మికి వినతిపత్రం అందించగా ఈ కేసుపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు.

రివ్యూలు సమతూకంతో ఉండాలి

● నిర్మాత ధనంజయన్



కొత్త సినిమాల రివ్యూలు సమతూకంతో ఉండాలని అపుడే ప్రేక్షకులు థియేటర్లకు వస్తారని, తద్వారా చిత్రపరిశ్రమను కాపాడవచ్చని ప్రముఖ నిర్మాత, పంపిణీదారుడు జి.ధనంజయన్ అభిప్రాయపడ్డారు. కొత్త సినిమాలకు మూడు రోజుల వరకు పబ్లిక్ టాక్ తీసుకునేందుకు యూట్యూబర్లకు థియేటర్ యాజమాన్యాలు అనుమతి వ్వరాదంటూ ఇటీవల హీరో విశాల్ చేసిన వ్యాఖ్యలపై ఆయన ఈ విధంగా స్పందించారు. 'మొదటి మూడు రోజులు రివ్యూలు చేసేందుకు అనుమతివ్వొద్దని హీరో విశాల్ ఇటీవల కోరారు. ఇలా చేయడం వల్ల అనేక సినిమాలు విడుదలయ్యాయా? లేదా? అనేది ప్రేక్షకులకు తెలియకుండాపోయే ప్రమాదం ఉంది. అందువల్ల రివ్యూలు అనేవి సమతూకంతో (బ్యాలెన్స్‌డ్) ఉండాలన్నదే మా వినతి' అని పేర్కొన్నారు.



చెక్కు అందజేస్తున్న దృశ్యం

రాజు కుటుంబానికి దక్షిణ్ విజయ్ ఆర్థిక సాయం

ఇటీవల ఓ మూవీ చిత్రీకరణలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన స్టంట్ ఆర్టిస్ట్ రాజు (మోహన్ రాజ్) కుటుంబానికి నటుడు, నిర్మాత దక్షిణ్ విజయ్ తనవంతుగా ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. రాజు కుమారుడు చదువు కోసం రూ.25 వేలు ఆయన అందజేశారు. దాదాపు 200కుపైగా చిత్రాల్లో ఎన్నో ప్రమాదకరమైన స్టంట్స్ చేసిన రాజు.. ఇటీవల పా.రంజిత్ దర్శకత్వంలో ఆర్య హీరోగా తెరకెక్కుతున్న 'వెట్టువం' సినిమా చిత్రీకరణలో హైరిస్క్ కార్ రేసింగ్ స్టంట్ చేస్తుండగా ప్రాణాలు కోల్పోయిన విషయం తెల్సిందే. ఆయన మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపాన్ని తెలిపారు. ఇదిలావుంటే, రాజు కుటుంబాన్ని ఆదుకునేందుకు పలువురు నటులు ముందుకు వస్తున్నారు. ఈ కోవలో దక్షిణ్ విజయ్ తనవంతు సాయంగా రూ.25 వేల ఆర్థిక సాయం చేశారు. అంతేకాకుండా, నిర్మాతగా కూడా తాను నిర్మించే చిత్రాలకు పనిచేసే స్టంట్ ఆర్టిస్ట్‌లకు తగిన భద్రతా ప్రమాణాలు కల్పిస్తామని దక్షిణ విజయ్ హామీ ఇచ్చారు.

'చెన్నై ఫైల్స్ - ముదల్ పక్కం' సందేశాత్మక చిత్రం

● అనీస్ అష్రాఫ్



ఆడియో రిలీజ్ దృశ్యం

తాను తమిళంలో తొలిసారి దర్శకత్వం వహించిన 'చెన్నై ఫైల్స్ - ముదల్ పక్కం' ఒక సందేశాత్మక క్రైమ్ థ్రిల్లర్ మూవీ అని ఆ చిత్ర దర్శకుడు అనీస్ అష్రాఫ్ అన్నారు. ఈ చిత్రాన్ని ఆగస్టులో విడుదల చేయనున్న నేపథ్యంలో చిత్రం ఆడియో, ట్రైలర్‌ను నగరంలో తాజాగా విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, 'దర్శకులు ఏఆర్ మురుగదాస్, మిష్కిన్ వద్ద పనిచేశాను. తమిళంలో నాకు ఇది తొలి చిత్రం. మురుగదాస్ వద్ద అసిస్టెంట్‌గా ఉన్న సమయంలో ఒక విషయాన్ని నేర్చుకున్నాను. సినిమా తెరకెక్కించాలని భావించినపుడు స్టోరీ, స్క్రిప్టు సామాజిక సందేశంతో ఉండాలి ఏఆర్.మురుగదాస్ స్క్రిప్టులు ఆ విధంగానే ఉంటాయి. మా సినిమా కూడా ఆ కోవలోనే సందేశాత్మకంగా రూపొందించాం. నిర్మాత మహేశ్వరన్ దేవదాస్ మాట్లాడుతూ, 'తొమ్మిదేళ్ళ వయసులో నటుడు కావాలన్న ఆశపడ్డాను. ఈ విషయాన్ని మా గురువు దృష్టికి తీసుకెళ్ళగా, ఆయన హితబోధ చేశారు. నేను కమల్ హాసన్ వీరాభిమానిని. నాకు విలన్ పాత్రలంటే అమితమైన ఇష్టం. 'గిల్లీ', 'తుపాకీ', 'తనీ ఒరువన్' వంటి చిత్రాలను ఎన్నో సార్లు చూశాను. ఆ చిత్రాల హీరోల కోసం కాదు. ఆ చిత్రాల విలన్ పాత్రల కోసం. తమిళ చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టేందుకు రెండేళ్ళపాటు హోంవర్క్ చేశాను. పక్కా ప్లాన్‌తో ఒక మంచి చిత్రాన్ని నిర్మించాలని భావించి ఈ సినిమా రూపొందించాం' అని వివరించారు. హీరో వెట్రి మాట్లాడుతూ, 'ఈ మూవీలో కథానాయకుడిగా నన్ను ఎంపిక చేసిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు. చాలా రోజుల తర్వాత ఒక మంచి ఎమోషనల్ క్రైమ్ మూవీ రూపొందించాం. షెడ్యూల్ ప్రకారం చిత్రీకరణ పనులు పూర్తి చేసి, ఆగస్టు 1వ తేదీన విడుదల చేస్తున్నాం' అని తెలిపారు. కాగా, ఈ చిత్రంలో వెట్రి సరసన శిల్పా మంజునాథ్ కథానాయిక. ఇతర పాత్రల్లో తంబి రామయ్య, మహేష్ దాస్, రెడిన్ కింగ్‌స్లీ, సుభద్ర, అనికా తదితరులు నటించారు. మీడియా మైండ్స్ సమర్పణలో చిన్నతంబి ప్రొడక్షన్ పతాకంపై నిర్మాత మహేశ్వరన్ దేవదాస్ నిర్మించారు.



సాయిపల్లవి



రుక్మిణీ వసంత్

చిత్రజ్యోతి

కమల్ చిత్రానికి నో చెప్పిన హీరోయిన్లు

అగ్ర నటుడు కమల్ హాసన్ హీరోగా నటించే 237వ చిత్రంలో నటించే అవకాశాన్ని హీరోయిన్లు సాయిపల్లవి, రుక్మిణీ వసంత్ సున్నితంగా తిరస్కరించారు. దీనికి కారణం.. వారిద్దరూ వేర్వేరు ప్రాజెక్టుల్లో బిజీగా ఉండటంతో క్యాల్షీట్‌లు సర్దుబాటు చేయలేక నో చెప్పారు. ప్రముఖ స్టంట్ మాస్టర్ ద్వయం అన్బరివు దర్శకత్వం వహించే 'కేహెచ్-237' ప్రీప్రొడక్షన్ నిర్మాణ పనులు గత కొన్ని రోజులుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా హీరోయిన్ల ఎంపిక చేపట్టారు. మొదట సాయిపల్లవిని సంప్రదించగా, ఆమె బాలీవుడ్ 'రామాయణ' మూవీలో బిజీగా ఉండటంతో నో చెప్పారు. ఆ తర్వాత యువ నటి రుక్మిణీ వసంత్‌ను సంప్రదించగా టాలీవుడ్ హీరో జూనియర్ ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ చిత్రంలో నటిస్తుండటంతో అంగీకరించలేదు. దీంతో ఇపుడు మలయాళ యంగ్ హీరోయిన్ కళ్యాణి ప్రియదర్శినితో చర్చలు జరుపుతున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం.

ఊటీ కొండ రైలులో ప్రయాణానికి పర్యాటకుల ఆసక్తి



కున్నూర్ రైల్వేస్టేషన్‌లో పర్యాటకులు

పెరంబూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఊటీ కొండ రైలులో ప్రయాణించేందుకు సోమవారం పెద్దసంఖ్యలో ప్రయాణికులు వేచి ఉన్నారు. ప్రముఖ పర్యాటక ప్రాంతం నీలగిరి జిల్లాకు వచ్చే పర్యాటకులు ఊటీ కొండ రైలులో ప్రయాణించేందుకు ఆసక్తి చూపుతుంటారు. ప్రయాణికుల సౌకర్యార్థం కున్నూర్-ఊటీ మధ్య ప్రతిరోజు తలా నాలుగు సార్లు, మేట్టుపాళయం-ఊటీ మధ్య తలా ఒకసారి కొండ రైలు సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం, వారాంతపు సెలవు రోజులు పురస్కరించుకుని శుక్రవారం నుంచి సోమవారం వరకు ప్రత్యేక రైలు సేవలు ఉంటాయని రైల్వే అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం జిల్లాకు భారీ వర్ష సూచన ప్రకటించడంతో అటవీ శాఖ ఆధీనంలోని పలు పర్యాటక ప్రాంతాలు మూసివేసినా, కొండ రైలులో ప్రయాణించేందుకు మాత్రం పర్యాటకులు ఆసక్తి చూపారు.


తాంతోండ్రియమ్మన్ సేవలో క్షత్రియ సంఘ కార్యదర్శి



రాష్ట్రకార్యదర్శి గోపీరాజును సత్కరిస్తున్న చెన్నై క్షత్రియ సంఘం నిర్వాహకులు

ప్యారీస్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరు సమీపంలోని అగరంలో కొలువైన తాంతోండ్రియమ్మన్ ఆలయాన్ని తమిళనాడు 'క్షత్రియ రాజుక్కల్ సంఘ' ప్రధాన కార్యదర్శి ఏఎం. గోపీరాజు ఆదివారం సాయంత్రం సందర్శించారు.ఈ సందర్భంగా కొళత్తూరు క్షత్రియ రాజుక్కల్ జనసేవా సమితి అధ్యక్షులు నామదేవరాజు, సంఘ నిర్వాహకులు గోపీరాజును కలిసి ఆలయ కమిటీ తరుపున ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఇటీవల తాను రాష్ట్ర క్షత్రియ సంఘం కార్యదర్శిగా ఎన్నికైన నేపథ్యంలో, తాంతోండ్రియమ్మన్ ఆశీస్సులు కోసం ఆలయానికి వచ్చినట్లు రాష్ట్ర కార్యదర్శి గోపీరాజు తెలిపారు. ఎల్లప్పుడు క్షత్రియ ప్రజానికానికి అందుబాటులో ఉంటూ కులాభివృద్ధి కోసం కృషిచేస్తానని ఆయన తెలిపారు. తర్వాత సంఘ నిర్వాహకులు గోపీరాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో చెన్నై క్షత్రియ రాజుక్కల్ జనసేవా సమితి నిర్వాహకులు రవిరాజు, రోశిరాజు, రవి కుమార్‌రాజు, పవన్‌కుమార్‌రాజు, సుదర్శన్‌రాజు, వేణుగోపాల్ వర్మ, సెంథిల్ రాజు, సుబ్రమణ్యరాజు, కాళహస్తి చెంచు దివ్యతేజావర్మ, అదిత్యవర్మన్, సుందరేశన్ వర్మ, మార్కండేయవర్మ, సుధీర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

తిరుత్తణి కొండపై రెండో ఘాట్‌రోడ్ కోసం సర్వే



తిరుత్తణి ఘాట్‌రోడ్

తిరుత్తణి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి కొండపై ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రప్రభుత్వం ఆలయానికి రెండో ఘాట్ రోడ్ ఏర్పాటుకు స్థలసేకరణ ప్రారంభించింది. ఇందుకోసం ప్రభుత్వం రూ.55 కోట్లు కేటాయించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం రెవెన్యూ, జాతీయ రహదారులశాఖ అధికారులు తిరుత్తణి కొండపై అనువైన స్థలం కోసం భూ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ మాట్లాడుతూ, త్వరలో ప్రారంభంకానున్న ఈ రెండో ఘాట్‌రోడ్డు పనుల్లో భాగంగా ఆ ప్రాంతంలోవున్న ఇళ్లు కూల్చాల్సివుంటుందని, ఇందులో ఎన్ని ఇళ్ల ఉంటాయన్నదానిపై విశ్లేషణ చేస్తున్నామని, కూల్చే ఇళ్ల యజమానులకు నష్టపరిహారం తదితర పనులన్నీ పూర్తికాగానే రెండో ఘాట్ రోడ్డు పనులు ప్రారంభంకానున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు శాంతి, రహదారుల ఇంజనీర్లు జ్ఞాన అరుళ్ రాజ్, తాహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

మణపాడులో మినీ ఓడరేవుపై వ్యతిరేకత
ఆందోళనకు సిద్ధమవుతున్న జాలర్లు



మణపాడు తీరం

టి.నగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లాలోని మణపాడు వద్ద మినీ ఓడరేవు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ మత్స్యకారులు ఆందోళన చేయాలని నిర్ణయించారు. దక్షిణాది జిల్లాల్లో తూత్తుకుడి ప్రత్యేకత సంతరించుకుంటోంది. ఆ జిల్లాలోని తీర ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి పథకాలు అమలులో ఉన్నాయి. పళయకాయల్ ప్రాంతంలో జిర్కోనియం ఫ్యాక్టరీ, కళ్ళామొళి ప్రాంతంలో థర్మల్ ప్లాంట్, కులశేఖరపట్టినంలో ఇస్రో వంటి కీలకమైన పథకాలు ప్రారంభించి వేగంగా పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ జిల్లాలోని మణపాడు తీరంలో మినీ ఓడరేవు నిర్మించేందుకు ప్రాథమిక స్థాయి పనులు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో చెంగల్పట్టు జిల్లా ముక్కైయూరు, పనయూరు, విల్లుపురం జిల్లా మరక్కాణం, కడలూరు జిల్లా శిలంబి మంగళం, మైలాడుదురై జిల్లా వానగిరి, నాగపట్టినం జిల్లా విళుందమావడి, తూత్తుకుడి జిల్లా మణపాడు, కన్నియాకుమారి జిల్లా కన్నియాకుమారి ఇలా ఎనిమిది ప్రాంతాలను ఎంపిక చేసి మినీ వాణిజ్య నౌకాశ్రయాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ మినీ ఓడరేవులను నిర్మించేందుకు ప్రైవేటు పెట్టుబడిదారులకు ఆహ్వానించింది. ఈ ఓడరేవులను 30 నుండి 99 సంవత్సరాల దీర్ఘకాలిక లీజుపై కేటాయించాలని కూడా ప్రణాళిక రూపొందించింది. ఈ నేపథ్యంలో తూత్తుకుడి జిల్లాలోని ప్రధాన పర్యాటక ప్రాంతాల్లో ఒకటైన మణపాడులో మినీ ఓడరేవు నిర్మాణాన్ని స్థానిక మత్స్యకారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 'దక్షిణాది గోవా'గా పేరుగాంచిన ఆ ప్రాంతంలో మినీ ఓడరేవు నిర్మిస్తే తమ జీవనాధారం దెబ్బతింటుందని జాలర్లు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయంలో తదుపరి చర్యలు చేపట్టడంపై గ్రామ సంక్షేమ కమిటీ అధ్యక్షులు క్లైడన్ నాయకత్వంలో మత్స్యకారుల సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులను సంప్రదించకుండా మణపాడులో మినీ ఓడరేవు నిర్మించడానికి ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ ఓడరేవు నిర్మాణ పనులను ఉపసంహరించుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు, ముఖ్యమంత్రికి వినతి పత్రాలు పంపాలని ఈ సమావేశంలో మత్స్యకారుల సంఘం ప్రతినిధులు నిర్ణయించారు. ఈ ప్రాజెక్టును విరమించుకోకపోతే దీర్ఘకాలిక ఆందోళనలు చేపట్టాలని సంకల్పించారు. మణపాడు గ్రామ సంక్షేమ కమిటీ కార్యనిర్వాహకులు ఈ సందర్భంగా మాట్లాడుతూ 'మణపాడ్ కు 3 కిలోమీటర్ల దూరంలో ఇప్పటికే బొగ్గు ల్యాండింగ్ ప్లాట్‌ఫామ్ నిర్మించారని, థర్మల్ ప్లాంట్ పనుల కోసం సముద్రతీరంలో 8.5 కిలోమీటర్ల పొడవునా వంతెన నిర్మించడంతో మత్స్యకారుల ఆదాయానికి గండి పడిందన్నారు. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మినీ ఓడరేవు నిర్మాణ ప్రాజెక్టును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తమ కోరికను పట్టించుకోకపోతే నిరసనోద్యమాల మినీ ఓడరేవు నిర్మాణ పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు.

అలరించిన వీ-2 డ్యాన్స్ అకాడమీ ప్రదర్శన

తిరుత్తణి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి క్షేత్రంలో వీ-2 డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నృత్యప్రదర్శన జరిగింది. ఆదివారం ఆడి కృతిక సందర్భంగా ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో, సోమవారం సాయంత్రం అకాడమీలో శిక్షణ పొందిన 10 మంది బాలికలు అద్భుతంగా నాట్యం చేసి అందరిని ఆకట్టుకున్నారు. ఇదిలా వుండగా, నృత్యప్రదర్శన చేసిన బాలికలందరూ తెలుగువారు కావడం గమనార్హం.

నృత్యప్రదర్శన చేస్తున్న బాలికలు ⟷



విక్టోరియా హాలు పునర్నిర్మాణ పనులు పూర్తి

● ఆగస్టు 15న పునఃప్రారంభం



అడయార్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరియమేట్‌లో ఉన్న విక్టోరియా హాలు మరమ్మతుతో పాటు సరికొత్త సొబగులను సంతరించుకుంది. దీంతో ఈ హాల్‌ను వచ్చే నెల 15వ తేదీ పునఃప్రారంభించనున్నారు. చెన్నై నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయ భవనమైన రిప్పన్ భవనానికి సమీపంలో ఈ 140 యేళ్ళ పురాతన భవనం ఉంది. 1982లో నగరంలో నివసించిన ప్రముఖులంతా ఒక చోట కలిసి టౌన్ హాల్ నిర్మించాలని తలపెట్టారు. ఈ భవన నిర్మాణం కోసం 1883లో 3.14 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఈ భవన నిర్మాణానికి విజయనగర మహారాజు ఆనంద గజపతిరాజు శంకుస్థాపన చేయగా, ఈ భవన నిర్మాణాన్ని ఇండో-సరాసెనిక్ ఆర్కిటెక్ట్ నిర్మాణశైలిలో నిర్మించేలా డిజైన్ చేశారు. ఈ టౌన్ హాల్ నిర్మాణ పనులను నంపెరుమాల్ శెట్టియార్ 1888లో ప్రారంభించి 1890లో పూర్తి చేశారు. అయితే, 1888లో జనవరిలో జరిగిన నగరవాసుల సమావేశంలో ఈ టౌన్‌హాల్‌కు విక్టోరియా మహారాణి స్వర్ణోత్సవాల సందర్భంగా ఆమె పేరు ఖరారు చేశారు. ఇదిలావుంటే, 2021-22లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి కేఎన్ నెహ్రూ మాట్లాడుతూ, నగరంలోని పురాతన విక్టోరియా హాల్‌కు మరమ్మతులు చేస్తామని ప్రకటించి, ఇందుకోసం రూ.32.62 కోట్లు కేటాయించారు. ఈ మరమ్మతు పనులను 2023 మార్చి 20న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధితో కలిసి కేఎన్ నెహ్రూ ప్రారంభించారు. పాత భవనం నిర్మాణశైలి ఏమాత్రం దెబ్బతినకుండా ఈ పనులను పూర్తి చేశారు. రెండంతస్తుల ఈ భవనంలో తొలి అంతస్తులో వీఐపీలు, కల్చరల్ ఈవెంట్స్ కోసం కేటాయించారు. ప్రస్తుతం చివరి దశ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులన్నీ త్వరితగతిన పూర్తి చేసి వచ్చే నెల 15న ఈ భవనాన్ని పునఃప్రారంభించాలని చెన్నై కార్పొరేషన్ అధికారులు నిర్ణయించారు.

ఘనంగా శివాజీ వర్ధంతి వేడుకలు



శివాజీ గణేశన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రభు తదితరులు

అడయార్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నడిగర్ సంఘం మాజీ అధ్యక్షుడు, మహానటుడు దివంగత నడిగర్ తిలగం శివాజీ గణేశన్ 24వ వర్ధంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో భాగంగా నడిగర్ సంఘం కార్యాలయ ప్రాంగణంలో శివాజీ గణేశన్ విగ్రహానికి పలువురు సినీ ప్రముఖులు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే, శివాజీ గణేశన్ చిత్రపటానికి ఆయన కుమారుడు, సినీ నటుడు ప్రభు, మనవడు విక్రమ్ ప్రభు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నడిగర్ సంఘం ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్, కార్యవర్గ సభ్యులు దళపతి దినేష్, శ్రీమన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు సౌందరరాజా, దశరథి, నడిగర్ సంఘం మేనేజర్ తామరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

● ప్రముఖ ఛార్టెడ్ అకౌంటెంట్ సాయిప్రసాద్



విద్యార్థులకు క్రీడా సామగ్రి అందిస్తున్న సాయిప్రసాద్, ప్రధానోపాధ్యాయులు గోపాలయ్య

చెన్నై, జూలై 21 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ సాయిప్రసాద్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. టి.నగర్‌లోని కేసరి మహోన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. విద్యార్థుల ప్రార్థనాగీతంతో ప్రారంభమైన కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం నాగుల గోపాలయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గోపాలయ్య మాట్లాడుతూ... సాయిప్రసాద్ తమ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.30 వేలు విలువైన క్రీడా పరికరాలు విద్యార్థులకు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సాయిప్రసాద్ మాట్లాడుతూ... విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి తగ్గుతోందని, అందుకు సరైన క్రీడా పరికరాలు, తర్ఫీదు తదితరాలు కారణమన్నారు. క్రీడల్లోనూ విద్యార్థులు రాణించేలా క్రీడా పరికరాలు అందిస్తున్నానని, విద్యార్థుల శ్రేయస్సు కోసం తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని సాయి ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు, వృద్ధులకు సహాయాల పంపిణీ

● మోహన్ రెడ్డికి ఘన నివాళులు



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అడయార్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక విల్లివాక్కంలోని మోహన్ నర్సింగ్ హోం అధినేత దివంగత డాక్టర్ సి.మోహన్ రెడ్డి 5వ వర్ధంతి సందర్భంగా పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు సహాయాలను పంపిణీ చేశారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో భాగంగా, కనకదుర్గ తెలుగు మహోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మోహన్ చిత్రపటానికి కరస్పాండెంట్, కార్యదర్శి సీఎం కిషోర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా వృద్ధులకు, దివ్యాంగులు, పేదలకు దుప్పట్లు, చీరలు తదితర సహాయాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నమో గాడ్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ ఆర్.నందగోపాల్, డాక్టర్ ఎన్.నాగభూషణం, డాక్టర్ గొల్లపల్లి ఇశ్రాయేలు, సంఘ సేవకులు శాంతకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.సార సుహాసిని, సహాయ ప్రధానోపాధ్యాయుడు అళగర్ రాజ్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని నివాళులు అర్పించారు. అదే విధంగా విల్లివాక్కంలోని ఎస్‌కేడీటీ ప్రాథమిక పాఠశాలలో కూడా మోహన్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని పేదలకు సహాయకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఎస్.రేణుక, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టాలిన్‌కు రజనీ పరామర్శ

చెన్నై, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చేరిన ముఖ్యమంత్రి స్టాలిన్‌ను నటుడు రజనీకాంత్ ఫోన్‌లో పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ అనారోగ్యం కారణంగా అపోలో ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. సోమవారం ఉదయం వాకింగ్ చేస్తున్న సీఎంకు హఠాత్తుగా తల తిరుగుతుండంతో ఆయనను వెంటనే ఆస్పత్రికి తరలించగా, వైద్యులు పరీక్షలు నిర్వహించారు. సీఎం ఆరోగ్యం స్థిరంగా ఉందని ఆసుపత్రి యాజమాన్యం ప్రకటన విడుదల చేసింది. సీఎం రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఈ కారణంగా సీఎం పాల్గొనాల్సిన అన్ని కార్యక్రమాలను రెండు రోజుల పాటు రద్దు చేశారు. సీఎం ఆరోగ్యం కుదుటపడాలని పలువురు కోరుకుంటున్న నేపథ్యంలో, నటుడు రజనీకాంత్ ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అలాగే, సీఎం త్వరగా కోలుకోవాలని పలు పార్టీ నేతలు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు.

రాజకీయాల్లో విజయ్ రాణించడం కష్టం

● రజనీ సోదరుడు సత్యనారాయణ జోస్యం

అడయార్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయల్లో సినీ హీరో, తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ రాణించడం కష్టమని సూపర్ స్టార్ రజనీకాంత్ సోదరుడు సత్యనారాయణ జోస్యం చెప్పారు. రామనాథపురం జిల్లా సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో జరిగిన ఒక వేడుకలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, గతంలో రజనీకాంత్‌కు గవర్నర్ పదవి వరించగా, ఆయన సున్నితంగా తిరస్కరించారన్నారు. రాజకీయ పదవులు చేపట్టేందుకు రజనీకాంత్ ఆసక్తి చూపలేదన్నారు. అలాగే, రాష్ట్ర రాజకీయాల్లో విజయ్ రాణించడం కష్టమని ఆయన ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు.





జస్టిస్ చంద్రకుమార్ - ఎస్.ప్రసాద్

తిరుమలలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీ చంద్రకుమార్, రాష్ట్ర మంత్రి సంధ్యారాణి, మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్‌రావు, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ప్రాసిక్యూషన్స్ జిల్లా డైరెక్టర్ ఎస్.ప్రసాద్, తిరుపతి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయశేఖర్ ఉన్నారు. కాగా దర్శనం అనంతరం మంత్రి సంధ్యారాణి ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడే మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా కాపాడాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కోదండరామాలయంలో పవిత్రాల సమర్పణ

తిరుపతి అర్బన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): కోదండరామాలయంలో సోమవారం పవిత్రాల సమర్పణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుతగా సీతారామలక్ష్మణుల ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేశారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కుంభారాధన, హోమం చేపట్టారు. అనంతరం స్నపన తిరుమంజనం నిర్వహించి ప్రదక్షిణగా సన్నిధికి వేంచేశారు. ఈ సందర్భంగా ధ్రువమూర్తులు, కౌతుకమూర్తులు, స్నపనమూర్తులు, బలిమూర్తులకు పవిత్రాలు సమర్పించారు. అలాగే విష్వక్సేన, ద్వార పాలకులు, భాష్యకారులు, గరుడాళ్వార్, యాగశాలలోని హోమగుండాలు, బలిపీఠం, ధ్వజస్తంభం, ఆలయం ఎదురుగా ఆంజనేయస్వామికి సైతం పవిత్రాలను సమర్పించారు. సాయంత్రం సీతారామలక్ష్మణులు బంగారు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో విహరించారు. యాగశాలలో వైదిక కార్యక్రమాలు చేపట్టారు.


సర్వ దర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని ఓ షెడ్‌లో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.33 కోట్లు


ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 87,138

తలనీలాలు సమర్పించినవారు: 30,099



పరిషత్తు పోటీలంటే నిర్వాహకులకు పెద్ద ప్రహసనంతో కూడుకున్న పని. ఆరు నెలలపాటు అనేకమంది కలిసి మోసే భారం.. అలాంటిది ఒకే ఒక్కడు తిరుపతి వేదికగా ఒక నాటక పరిషత్తును పాతికేళ్లుగా నడిపిస్తున్నాడు. ఆ సంస్థ పేరు అభినయ ఆర్ట్స్, ఆ వ్యక్తి పేరు బీఎన్ రెడ్డి. నటన ఆయన ప్రాణం, నటన ఆయన జీవితం. నటనే ఆయన ప్రపంచం. ఆ నిత్య నటనోత్సాహి నడుపుతున్న అభినయ ఆర్ట్స్ రజతోత్సవ వేడుకలు జరుపుకుంటోంది. ఈ సందర్భంగా బీఎన్ రెడ్డి నట, జీవన యాత్ర.. ఆయన మాటల్లోనే..

తిరుపతి, ఆంధ్రజ్యోతి







దర్శకుడిగా సినిమా

దీన్ని చూసిన స్నేహితులు సినిమా చేయమని ప్రోత్సహించారు. తిరుపతి వైద్యులు డాక్టర్ కీర్తి, డాక్టర్ పార్థసారథి నిర్మాతలుగా 'నీతోనే హాయ్‌హాయ్' సినిమాను తీశాం. తెలుగుతోపాటు హిందీలో కూడా రిలీజ్ చేశాం. రెండో సినిమాకు కథను సిద్ధం చేసుకుంటున్నా.





నట కెరటం

అభినయ ఆర్ట్స్ బీఎన్ రెడ్డి

లోహితాసుడిగా తొలి వేషం

మాది నెల్లూరు జిల్లా హసనాపురం. అమ్మానాన్నలకు ఐదుగురు సంతానం. 16 మంది మేనమామలు. ఉమ్మడి కుటుంబం. మా మేనమామలు అందరూ పౌరాణిక నాటకాలు ఆడేవారు. ఒక్కోసారి ఒక నాటకంలో అన్ని పాత్రలూ మా ఇంట్లోవాళ్లే వేసేవారు. స్త్రీ పాత్రలు మాత్రం వేసేవారు కాదు. మా నాన్న రామాయణ, భారతాల గురించి చెప్పేవారు. వీరందరినీ చూస్తూనే పెరిగాను. ఒకసారి మా ఊళ్లో సత్యహరిశ్చంద్ర నాటకం వేయాలనుకున్నారు. అందులో లోహితాసుడిగా నన్ను ఎంపిక చేసుకున్నారు. నాలుగు పద్యాలు నేర్పించి స్టేజి ఎక్కించారు. ఇక అక్కడి నుంచీ నాటకం నాకో వ్యసనంగా మారింది. హార్మోనియం సౌండ్ వినిపిస్తే చాలు బడి ఎగ్గొట్టేసేవాడిని. ఇంట్లో తిడతారని దూలం మీద నక్కి కూర్చుని ఇంట్లో జరిగే రిహార్సల్స్ చూస్తూ ఉండేవాడిని. ఇంటిలో మందలించినప్పటికీ దొంగచాటుగా ఇంటి దూలం ఎక్కి ఆలకించేవాడిని.

అప్పుడెక్కిన స్టేజీ ఇంకా దిగలేదు

నా 14వ ఏట డైరెక్టర్ అయిపోయాను. ఆగస్టు 15 సందర్భంగా స్కూల్‌లో నాటిక వేయాలనుకున్నాం. మా మాస్టారు కామేశ్వరరావు నన్ను పిలిచి 'మనుషులంతా ఒక్కటే' నాటికను ఇచ్చి 'నువ్వే డైరెక్టర్ నాటకామాడించు' అన్నారు. అంతే.. అప్పుడు ఎక్కిన స్టేజీ ఇప్పటికీ దిగలేదు.

రంగస్థలం కోసం రిక్షా తొక్కా

మా నాన్న చనిపోయాక కుటుంబ భారం మీద పడింది. వానొస్తేనే వ్యవసాయం. పని వెతుక్కుంటూ నెల్లూరుకు చేరుకున్నా. పగలంతా బేల్దారి కూలీ.. రాత్రిళ్లు రిక్షా తొక్కేవాడిని. ఆ కష్టాన్ని ఇప్పటికీ మరవలేదు. అప్పుడూ నాటకాన్ని వదల్లేదు. ఒక మధురమైన అనుభవం ఏమిటంటే.. కూలీగా నేను ఇటుకలు మోసిన ఇంటికే పాతికేళ్ల తర్వాత అతిథిగా వెళ్లడం. అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శిగా నాటకం నాకు ఆ గౌరవం ఇచ్చింది.

ఆతిథ్యం అందుకున్నా. చేతితో గోడను నెమ్మదిగా తాకుతూ ఆనందబాష్పాలతో నిద్రపోయా. ఆరోజు నా జీవితంలో మరిచిపోలేనిది. 8ఏళ్ల క్రితం అభినయ ఆర్ట్స్ పనిమీద ప్రకాశం జిల్లాకు వెళ్లా. రాత్రి 4 గంటలకు రైలు దిగా. బయటకు రాగానే ఆటో, రిక్షాలు కనిపించాయి. నేరుగా రిక్షా వైపుకెళ్లి నేను వెళ్లాల్సిన అడ్రస్ చెప్పా. కొంతదూరం వెళ్లాక రిక్షావాలాను దిగమని, నేను ఎక్కి రిక్షా తొక్కా. అలవాటు తప్పిందా లేదా అని పరీక్షించుకున్నా. రిక్షా ప్రయాణం సవ్యంగానే సాగింది. తెల్ల దుస్తులతో రిక్షా తొక్కుతుంటే అతను ఆశ్చర్యపోయాడు. గతం చెప్పాక అతని ఆశ్చర్యానికి సమాధానం దొరికింది.

పరుచూరి ప్రోత్సాహంతో సినిమాల్లోకి..

యుక్త వయసులో సాంఘిక నాటికలు విస్తృతంగా వేసేవాళ్లం. కలియుగమా కళ్లతెరువు, నీతీ నీవెక్కడ, గుండెలు మార్చబడును, ఏక్‌దిన్‌కా సుల్తాన్, పూల రంగడు.. ఇలా ఎన్నో నాటికల్లో కీలక పాత్రలు నావే. 'హుష్‌కాకి' అనే నాటికలో లచ్చిగాడు అనే బిక్షగాడు పాత్ర వేశా. ఆ రోజు సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా వచ్చారు. నాటికలోని నాపాత్ర చూసి అభినందించి, సినీ పరిశ్రమకు రమ్మన్నారు. తొలి సినిమా అవకాశం.. డాక్టర్ భవాని చిత్రంలో. నటుడిగా ఉంటూనే ప్రొడక్షన్ అసిస్టెంట్‌గా, మేనేజర్‌గా, కంట్రోలర్‌గానూ చేసేవాడిని. జంబలకిడిపంబ, ఇద్దరు పెళ్లాల ముద్దుల పోలీస్, ఒరేయ్ రిక్షా, ఒసేయ్ రాములమ్మ, టాప్‌హీరో, ఆ..ఒక్కటీ అడక్కు...ఇలా వంద సినిమాలకు పైగా ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేశా. దర్శకరత్న దాసరి నారాయణ రావు దగ్గర శిష్యుడిగా ఉండే అవకాశం కొంతకాలం వచ్చింది. తిరుపతి అమ్మాయిని పెళ్లి చేసుకోవడంతో తిరుపతికి వచ్చేశా. ఆ సమయంలోనే గురువు దివంగత డాక్టర్ ఎన్.శివప్రసాద్‌తో సాన్నిహిత్యం ఏర్పడింది. ఆయన దగ్గర పనిచేసే అవకాశం వచ్చింది.

అభినయ ఆర్ట్స్ ప్రస్థానం

సినిమా పరిశ్రమ హైదరాబాద్‌కు మారిన తర్వాత అక్కడ ఇమడలేక తిరుపతికి తిరిగి వచ్చేసి అభినయ ఆర్ట్స్‌ను స్థాపించా. ఒక రోజు కార్యక్రమాలతో మొదలుపెట్టి.. నేడు 9 రోజులపాటు జాతీయ స్థాయి నాటకోత్సవాలను నిర్వహించే దాకా ఎదిగింది. రూ.14వేలతో మొదలుపెట్టిన కార్యక్రమం నేడు పాతిక లక్షలకు చేరింది. ఇదంతా నా వెన్నంటి ఉండే చిరకాల దాతలు, మిత్రుల సహకారం. ముఖ్యంగా నాభార్య యమున.. అతిథులు, కళాకారులకు కడుపునిండా అన్నంపెట్టి పంపుతుంది. కుటుంబ సభ్యులందరూ పనులన్నీ పక్కనపెట్టి పదిరోజుల పాటు మహతిలో కష్టపడతారు. ఆరునెలల పాటు అభినయ ఆర్ట్స్ పనిలోనే ఉంటా.



రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డు అందుకుంటున్న బీఎన్ రెడ్డి



గరుడ నాటకోత్సవాలలో ఉత్తమ హాస్యనటుడిగా నూతన ప్రసాద్ చేతుల మీదుగా అవార్డు

నంది అవార్డు

అభినయ ఆర్ట్స్ స్థాపించాక వేషాలు వేయడం తగ్గిపోయింది. గరుడ నాటకోత్సవంలో శ్రీకృష్ణతులాభారంలో వసంతకుడిగా నటించి ఉత్తమ హాస్యనటుడి అవార్డు దక్కించుకున్నా. రాష్ట్ర ప్రభుత్వ నంది నాటకోత్సవాలలో విరాట్ పాండవీయంలో ఉత్తర కుమారుడు పాత్రకు బంగారు నంది అందుకున్నా. ఏపీ పోలీస్ శాఖ కోసం ఎర్రచందనం అక్రమ రవాణాను నిరోధించడంపై 'మనసంపద' పేరుతో షార్ట్‌ఫిల్మ్ తీశా. ఇందులో విలన్ పాత్ర చేశా.



శ్రీవారి ఆలయానికి మేఘమాల

పచ్చని గుట్టలు.. చల్లని గాలులు.. నీలాకాశం మీద తేలాడుతూ వచ్చిన తెల్లని మబ్బులు.. తిరుమల ఆలయం వెనుక వాలి సేదదీరుతూ భక్తులకు కనువిందు చేశాయి. అఖిలాండం వద్ద నుంచి చూస్తే శ్రీవారి ఆలయానికి ప్రకృతి వేసిన శ్వేతమేఘమాలలా కనిపించింది. పలువురు ఈ దృశ్యనేపథ్యంగా ఫొటోలు దిగారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కనుల పండువగా కుమారస్వామి రథోత్సవం





పురవీధుల్లో రథంపై ఊరేగుతున్న సుబ్రహ్మణ్యస్వామి - తెప్పపై విహరిస్తున్న స్వామివారు

శ్రీకాళహస్తి, జూలై 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలలో భాగంగా సోమవారం నిర్వహించిన రథోత్సవం కన్నులపండువగా సాగింది. ముందుగా ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ శ్రీవళ్లీ దేవసేన సమేత కుమారస్వామిని రథంపై అధిష్టింపజేసి చతుర్మాడ వీధుల్లో ఊరేగించారు. రథంపై ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని కర్పూర హారతులు సమర్పించారు.

నేత్రపర్వంగా తెప్పోత్సవం

శ్రీవళ్లీ దేవసేన సమేత కుమారస్వామిని మొదట అలంకార మండపంలో విశేషంగా అలకరింపజేసి మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్య నారద పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. అక్కడస్వామి అమ్మవార్లను తెప్పలపై అధిష్టింపజేసి నారద పుష్కరణిలో పూజలు చేశారు. అనంతరం తెప్పపై విహరిస్తున్న శ్రీవళ్లీ దేవసేన సమేత కుమారస్వామిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పుష్కరిణి వద్ద పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాల వాడిపోయింది గోవిందా..





మే నెలలో ధరింపజేసిన మాలలు

వాడిన మాలలతో ఆంజనేయస్వామి విగ్రహం

అలిపిరి కాలినడకమార్గంలో ఏడోమైలు వద్ద ఉండే ప్రసన్న ఆంజనేయస్వామి నిలువెత్తు విగ్రహం వాడిన పూలమాలతో దర్శనమిస్తోంది. హనుమజ్జయంతి సందర్భంగా గత మే నెలలో ప్రసన్న ఆంజనేయస్వామికి భారీ పుష్ప, ఆకుమాలలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఆ తర్వాత వాటిని తొలగించలేదు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో

ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్లు జైలుశిక్ష

❖ రూ.మూడు లక్షల చొప్పున జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జూలై 21(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.మూడు లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన మునియప్ప, మంజునాథ్ కొన్నేళ్లుగా శేషాచలం అడవుల్లోకి ప్రవేశించి ఎర్రచందనం చెట్లు నరికి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు అక్రమ రవాణా చేస్తున్నారు. 2018లో శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా చేయడానికి ప్రయత్నిస్తుండగా పీలేరు అటవీశాఖ సెక్షన్ అధికారి ఎన్.చిన్నబాబు పట్టుకుని ఫారెస్టు కార్యాలయానికి తీసుకొచ్చారు. విచారించగా వాస్తవాలు అంగీకరించడంతో వారిపై కేసు నమోదు చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి విచారణ దశలో ఉన్న ఈ కేసు తిరుపతి ఎర్రచందనం ప్రత్యేక న్యాయస్థానానికి వచ్చింది. ఈ కేసుకు సంబంధించి లైజన్ అధికారి బాబుప్రసాద్, ఏపీపీ బాలకృష్ణమ నాయుడు, ఎఫ్ఆర్‌వో ఖ్యాతి, కోర్టు కానిస్టేబుల్ కృష్ణమూర్తి సాక్షాధారాలను కోర్టులో సమర్పించారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి నరసింహమూర్తి నిందితులకు ఈ మేరకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

3 గంటలు ఆలస్యంగా నడిచిన

ఇండిగో విమానం

అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రయాణికులు

రేణిగుంట జూలై 21:(ఆంధ్రజ్యోతి) : ఇండిగో విమానం సోమవారం మూడు గంటలు ఆలస్యంగా నడవడంపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. బెంగళూరు నుంచి తిరుపతి విమానాశ్రయానికి .మధ్యాహ్నం 2.35కు వచ్చి తిరిగి హైదరాబాదుకు 2.55గంటలకు పోవాల్సిన విమానం సాంకేతిక కారణాలతో సాయంత్రం 5.05 గంటలకు వచ్చి 5.35 గంటలకు హైదరాబాదుకు వెళ్లింది. దీంతో టిక్కెట్లు బుక్ చేసుకున్న 40 మంది ప్రయాణికులు మూడు గంటలు విమానాశ్రయంలో పడిగాపులు కాశారు. ఇండిగో యాజమాన్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

లింక్ ఓపెన్ చేస్తే రూ.50వేలు మాయం

నాయుడుపేట టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అత్తలపాళెం గ్రామానికి చెందిన ఓ యువకుడి సెల్‌ఫోన్‌కు ప్రైజ్ వచ్చిందంటూ మెసేజ్ వచ్చింది. అందులోని లింక్ ఓపెన్ చేసి తన వివరాలను నమోదు చేశాడు. అంతే క్షణాల్లో అతని బ్యాంక్ ఖాతాలోని రూ.50వేల నగదు మాయమైంది. దీంతో బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఎస్వీయూలో స్వయం కోర్సులకు మంచి స్పందన



ప్రశంసాపత్రంతో వీసీ అప్పారావు తదితరులు

● సైన్స్ కాలేజీకి స్వయం - ఎన్‌పీటీఈఎల్ నుంచీ ప్రశంస

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ నూతన విద్యా విధానం-2020లో భాగంగా విద్యార్థులు స్వయంగా ఆన్‌లైన్ ద్వారా శిక్షణ పొందేందుకు 'స్వయం' కోర్సులను అమలు చేస్తున్నారు. ఐఐటీ, ఎన్ఐటీ, సెంట్రల్ యూనివర్సిటీలు ఈ విధానంలో కీలక భూమిక పోషిస్తున్నాయి. ఎస్వీయూ కూడా స్వయం కోర్సులను ప్రవేశపెట్టింది. దీనికి విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చింది. దీనిపై స్వయం - ఎన్‌పీటీఈఎల్ నుంచి యూనివర్సిటీ సైన్స్ కాలేజీకి ప్రశంసలు లభించాయి. ఎక్కువ మంది విద్యార్థులు సైన్స్ కాలేజీ నుంచి స్వయంలో నమోదు చేసుకుని, ఉత్తీర్ణులై, సర్టిఫికెట్లు సైతం పొందారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ప్రిన్సిపాల్ పద్మావతి, స్వయం ఇన్‌చార్జి భారతి, మీడియా డీన్ పీసీ వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. దివ్యాంగ విద్యార్థులకు స్వయం కోర్సులకు దరఖాస్తు చేసుకోవడంలో ఫీజు రాయితీ ఉండటం మంచి పరిణామమని అన్నారు.

అగ్రికల్చర్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి అనుమతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 21 (ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు అనుమతిస్తూ ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ కారణాలతో తిరుపతి వ్యవసాయ కళాశాలలో నిర్వహిస్తున్న అగ్రికల్చర్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశానికి అనుమతి నిరాకరించారు. అయితే, పలువురి విజ్ఞప్తి మేరకు ప్రవేశాలకు అనుమతించారు. ఈనెల 25వ తేదీకి వెబ్ ఆప్షన్ల నమోదుకు చివరి గడువుగా విధించినట్టు ప్రిన్సిపాల్ సుమతి చెప్పారు.

జర్మనీలో ఉద్యోగావకాశాలు

● నర్సింగ్ కోర్సు చేసిన వారికి ఉచిత శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), జూలై 21(ఆంధ్రజ్యోతి): నర్సింగ్‌కోర్సులు పూర్తిచేసిన వారికి జర్మనీ వంటి దేశాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సాంఘిక సంక్షేమాధికారి విక్రమ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో తిరుపతి నగరంలో షెడ్యూల్‌కులాలకుచెందిన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం నర్సింగ్ పూర్తిచేసిన వారు అర్హులని, వారికి ఉచితంగా పది నెలలు జర్మనీ భాషపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 80083 59664, 87906 54826 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

చిత్తూరు డీసీసీబీకి నాబార్డు ప్రశంస

నగరి/చిత్తూరు కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి): గడువుకు ముందే సింగిల్ విండోల కంప్యూటరీకరణ పూర్తి చేయడంతో పాటు జిల్లా రైతాంగానికి సహకార రంగం ద్వారా రుణాలు, అడ్వాన్సులు తదితర అంశాలలో ప్రతిభ కనబరిచిన చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)కు విశిష్ట గౌరవం లభించింది.నాబార్డు 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని నాబార్డు ప్రాంతీయకార్యాలయంలో సోమవారం రాష్ట్రస్థాయి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ పనితీరు కనబరిచిన చిత్తూరు, కృష్ణా, నెల్లూరు డీసీసీబీల అధికారులకు మెమొంటోలను అందజేశారు.సహకార శాఖ కమిషనర్ అహ్మద్‌బాబు చేతుల మీదుగా చిత్తూరు డీసీసీబీ సీఈవో శంకర్‌బాబు మెమొంటోను స్వీకరించారు.రాష్ట్రస్థాయిలో నాలుగు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(సింగిల్‌విండో)ఉత్తమ పనితీరు కనబరిచినట్లు నాబార్డు గుర్తించి సన్మానించింది.చిత్తూరు జిల్లాకు సంబంధించి నిబంధనలు పాటించి బ్యాంకును ఉన్నతస్థాయికి తీసుకెళ్లడమే గాక అన్ని రకాల రుణాలను రైతులకు అందించినందుకు నగరి సింగిల్ విండో తరఫున సీఈవో తులసిపిళ్లై, ఛైర్మన్ బాలాజి, డైరెక్టర్ జవహర్‌రెడ్డి మెమొంటో అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డు చీఫ్ మేనేజర్ గోపాల్, ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ బషీర్, ఆబ్కాబ్ ఎండీ శ్రీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





మెమెంటో అందుకుంటున్న డీసీసీబీ సీఈవో శంకర బాబు, నగరి పీఏసీఎస్ సీఈవో తులసి

9మంది స్మగ్లర్ల అరెస్టు

● 16 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

మంగళం, జూలై 21(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా బాలపల్లి ఫారెస్టు రేంజ్‌లో సోమవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు 9 మంది స్మగ్లర్లను అరెస్టు చేసి, 16 ఎర్రచందనం దుంగలు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఏఆర్ ఎస్ఐ బాలచెన్నయ్య బృందం స్థానిక ఎఫ్‌బీవో సుబ్బలక్ష్మితో కలిసి బాలపల్లి రేంజ్ అటవీప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు.ఆ ప్రాంతంలో కొందరు వ్యక్తులు రెండు కార్లతో టాస్క్‌ఫోర్సు పోలీసుల కంటపడటంతో వారిని చుట్టుముట్టగా పారిపోయే ప్రయత్నం చేశారు. అయితే టాస్క్‌ఫోర్సు పోలీసులు 9మందిని పట్టుకోగలిగారు. పట్టుబడిన వారు నంద్యాల, అన్నమయ్య జిల్లా, కర్ణాటకకు చెందిన వారిగా గుర్తించారు. వాహనంలోలోడ్ చేసిన 16 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ స్మగ్లర్లను వాహనాలతో సహా ఎర్రచందనాన్ని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పట్టుబడ్డ స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు